# వార్త

ఆదివారం

8 అక్టోబరు, 2023



# మహిళకు పట్టం




# వరుస సినిమాలతో శ్రీలీల బిజీ!

'పెళ్లిసందడి' చిత్రంతో టాలీవుడ్ వెండితెరకు పరిచయమైన అచ్చ తెలుగు అమ్మాయి శ్రీలీల. ఆ తర్వాత 'ధమాకా' చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా రామ్ సరసన నటించిన 'స్కంద' చిత్రం ఇటీవలే విడుదలైంది.

తెలుగమ్మాయిలు ఇండస్ట్రీలో ఎదగడం కష్టం అనే అభిప్రాయాన్ని శ్రీలీల తొలగించింది. తొలి సినిమా ఓ మోస్తరుగా ఆడినప్పటికీ శ్రీలీల పెర్ఫార్మెన్స్‌కు ఫుల్ మార్కులు పడ్డాయి. ప్రస్తుతం అమ్మడి చేతిలో ఉన్న సినిమాలు చూస్తే ఆ విషయం తెలుస్తుంది.

పవన్ కళ్యాణ్‌తో 'ఉస్తాద్ భగత్‌సింగ్', మహేశ్‌బాబుతో 'గుంటూరు కారం' చిత్రాల్లోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. నందమూరి బాలకృష్ణ 'భగవంత్ కేసరి' చిత్రంలో ఓ కీలక పాత్రలో కనువిందు చేయనుంది ఈ తెలుగమ్మాయి. నితిన్ సరసన 'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్'లో, వైష్ణవ్‌తేజ్ జోడీగా 'ఆదికేశవ రెడ్డి'

## తారాతీరం



# 'ఈగల్' సంక్రాంతికి విడుదల!

మాస్ మహారాజా రవితేజ నటించిన 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబర్ **20**వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ సినిమాతో నుపుర్ సనన్ కథానాయికగా పరిచయమవుతోంది.

ఆ తరువాత రవితేజ నుంచి మరో సినిమా థియేటర్లకు రానుంది. విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి రానుందనే వార్తలు చాలా రోజులుగా వినిపిస్తున్నాయి. జనవరి **13**వ తేదీన ఈ సినిమా విడుదల కానున్నట్లు తాజా సమాచారం.

కార్తీక్ ఘట్టమనేని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్ కథానాయికలుగా సందడి చేయనున్నారు. 'ఏక్ మినీ కథ', 'బిచ్చగాడు **2**' చిత్రాల ద్వారా కావ్యథాపర్ తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది.

ఆదివారం వార్త

8 అక్టోబరు, 2023

## మంచి ముత్యాలు

మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి

- యేసుప్రభువు

## విషయ విశేషం


వాట్సప్‌లో వేర్వేరు ఫీచర్లు... 4

'సంఘీ'భావం....5

పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యమేల?

కవర్ స్టోరీ..6

మహిళకు పట్టం

చూపులేని వారికి స్మార్ట్ విజన్ కళ్లద్దాలు..11

ఈవారం కవిత్వం..12

మౌనం ద్రవించిన వేళ

కడపలో వెలసిన ఆలయాలు....14

కథ.. 20

నాన్న..వెనకబడ్డాడు

సాహిత్యం..24

తెలుగు పాటకు ఆద్యుడు 'అన్నమయ్య'

పర్యాటకుల స్వర్గధామం 'లడక్'...25

దక్షిణ నైరుతిలో సెప్టిక్ ట్యాంక్ ఉండవచ్చా?...29

ఇంకా..

పుస్తక సమీక్ష


ముగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### గుర్రాల లైబ్రరీ



గిరిరాష్ట్రం ఉత్తరాఖండ్ ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకి అతలాకుతలమైపోయింది. కనుమల్లో కొండచరియలు విరిగిపడి చాలాచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కుమవాన్ డివిజన్‌లో ఉన్న నైనిటాల్ జిల్లాలో చాలా బడులు ఇప్పటికీ తెరచుకోలేదు. మరి అక్కడి పిల్లల చదువేం కావాలి? ఆన్‌లైన్‌లో చదువు చెప్పడానికి ఉత్తరాఖండ్‌లో పెద్దగా ఇంటర్నెట్ వసతి కూడా లేదు. అందుకే దీనికో కొత్త పరిష్కారం కనిపెట్టాడు 29 ఏళ్ల సుభాన్ బదానీ. వృత్తిరీత్యా లైబ్రరియన్ అయిన సుభాన్, ఆ పిల్లలకి కథల పుస్తకాలనైనా చేరువచేయాలను కున్నాడు. రహదారులు బాగాలేని కొండమార్గాల్లో పిల్లలకి పుస్తకాలని చేరవేయడానికి ఏ వాహనాలు వెళతాయి? అప్పుడు అతని దృష్టి గుర్రాలపై పడింది. తాను సేకరించిన పుస్తకాలని గుర్రాలపైన పల్లెలకు తీసుకెళ్లడం ప్రారంభించాడు సుభాన్. అలా నైనిటాల్ జిల్లాలోని పలు ప్రాంతాలకి పుస్తకాలని గుర్రాలతో తీసుకెళితే అక్కడి



చిన్నారుల ఆశ్చర్యం అంతాఇంతా కాదు. ఆ పిల్లలకి కేవలం పుస్తకాలనిచ్చి ఊరుకోవడం కాదు. ఓ రోజంతా వలంటీర్లు అక్కడే ఉండి వాళ్లచేత చదివిస్తున్నారు. ఆ తర్వాత పుస్తకాలని వాళ్లకే ఇచ్చి వారం తర్వాత తీసుకుంటున్నారు. ఈ లైబ్రరీ మొదలైంది పిల్లలతోనైనా ఇప్పుడు వాళ్ల తల్లిదండ్రులూ ఎక్కువగా చదివేస్తున్నారు. మంచి పరిణామమే ఇది.

**పేషెంట్:** నేను పర్యావరణ ప్రేమికుణ్ణి అంచేత నాకు 'ప్లాస్టిక్' సర్జరీకి బదులు 'పేపర్' సర్జరీ మాత్రమే చేయండి డాక్టర్.
**డాక్టర్:** సరే, మీ చావుకు నేను బాధ్యుడిని మాత్రం కాదు.

...

**రవి:** భార్యా హెల్మెట్లూ రెండూ ఒకటేనా! అదెలా?
**గోపి:** రెండూ నెత్తిమీద పెట్టుకున్నంత వరకే భర్తప్రాణం సేఫ్.


మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# వాట్సప్‌లో వేర్వేరు ఫీచర్లు



వాట్సప్‌లో లింక్డ్ డివైసెస్ ఫీచర్ గురించి తెలిసిందే. ఒకే వాట్సప్ ఖాతాకు నాలుగు పరికరాలను కనెక్ట్ చేసుకోవటానికిది తోడ్పడుతుంది. ప్రధాన పరికరం యాక్టివ్‌గా లేకపోయినా ఆయా పరికరాలకు మెసేజ్‌లు, కాల్స్ వేర్వేరుగానూ అందుతాయి. ఆండ్రాయిడ్ యూజర్లకైతే డ్యుయెల్ యాప్ ఫీచర్ కూడా ఉంది. దీంతో వాట్సప్ యాప్‌ను క్లోన్ చేసుకోవచ్చు. వేర్వేరు ఖాతాలతో వాడుకోవచ్చు. ఐఫోన్ వాడేవారైతే వాట్సప్ బిజినెస్, మామూలు వాట్సప్‌లను విడివిడిగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒకే సమయంలో ఈ రెండింటినీ వాడుకోవచ్చు. కానీ డెస్క్‌టాప్ దగ్గరికి వచ్చేసరికి పరిస్థితి మారిపోతుంది. అధికారికంగా విండోస్ కోసం బిల్టిన్ క్లోన్ యాప్ ఫీచర్లు, వేర్వేరు వర్షన్లు ఏవీ లేవు. అయితేనేం? డెస్క్‌టాప్ మీద రెండు వాట్సప్ ఖాతాలను వాడుకోవటానికి మార్గాలు లేకపోలేదు. ముందు మైక్రోసాఫ్ట్ స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ లేదా వాట్సప్ అధికార వెబ్‌సైట్ నుంచి వాట్సప్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం రెండో పద్ధతిని ఉపయోగించాలి. వెబ్‌బ్రౌజర్‌ను ఓపెన్ చేసి వెబ్.వాట్సప్.కామ్‌లోకి వెళ్లాలి. దీనికి లింక్డ్ డివైస్ ఫీచర్ ద్వారా కనెక్ట్ కావాలి. ఇలా ఒకే సమయంలో రెండు వాట్సప్ ఖాతాలను వాడుకోవచ్చు.

గ్రూప్ ఛాట్స్ వడపోత కోసం

ఇటీవల ఛాట్ లాకింగ్, ఛాట్ ట్రాన్స్‌ఫర్ వంటి ఫీచర్లను పరిచయం చేసిన వాట్సప్ తాజాగా గ్రూప్ ఛాట్స్‌ను వడపోసే కొత్త ఫీచర్‌ను తెస్తోంది. ఉత్తర ప్రత్యుత్తర్యంతో మెసేజ్‌ల ప్రాధాన్యాన్ని నిర్ణయించటం తేలికవుతుంది. అయితే ఈ ఫీచర్ ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. గూగుల్ ప్లే బీటా ప్రోగ్రామ్ ద్వారా వాట్సప్ కొత్త వర్షన్‌తో ఇది అందుబాటులో ఉంటుంది. కొత్త ఫిల్టర్ సదుపాయంతో వ్యక్తిగత సంభాషణలను పక్కకు పెడుతూ గ్రూప్ ఛాట్స్ జాబితాను సృష్టించుకోవచ్చు.

# కృత్రిమ మేధతో మానసిక సమస్యకు చెక్!



**పిల్లల** పెంపకంలో కౌమారదశ ఎంతో కీలకం. స్కూలు, కాలేజీ, ఇల్లు, సమాజం..ఇలా అన్నిచోట్లా తమకొచ్చిన సమస్యని పరిష్కరించుకోలేక తల్లడిల్లిపోతారు. కొందరు ఆత్మహత్య చేసుకోవడానికీ వెనుకాడరు. ఇంటాబయటా ఎవరూ గుర్తించలేని ఆ విషయాన్ని కృత్రిమ మేధస్సుతో పనిచేసే మెషీన్ చక్కగా కనిపెట్టగలదు అంటున్నారు ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ అవేర్‌కు చెందిన పరిశోధకులు. పిల్లలు ఏదైనా మానసిక సమస్యతో బాధపడుతున్నారా లేదా అన్న విషయాన్ని ఏఐ చక్కగా గుర్తించగలదట. ఇందుకోసం 14–16 ఏళ్ల వయసులోని రెండువేల మంది పిల్లల్ని ఎంపికచేసి వాళ్లను అడిగిన రకరకాల ప్రశ్నల్నీ వాటికి వాళ్లు చెప్పిన సమాధానాల్నీ కంప్యూటర్‌లో పొందుపరిచిన అల్గారిథమ్‌కు అందించారు. అది వాటిని పరిశీలించి ఏయే పిల్లలకు సమస్యలున్నాయో కచ్చితంగా చెప్పిందట. వాళ్లలో కొందరు గతంలో ఆత్మహత్యలకు పాల్పడిన సంగతినీ పసిగట్టిందట. ఆ విషయాన్ని పిల్లలూ అంగీకరించారట. ముఖ్యంగా ఈ అధ్యయనం ద్వారా ఆయా పిల్లల మానసిక పరిస్థితికి చుట్టుపక్కల వాతావరణమే కీలకమనీ అదే వాళ్లను ఎక్కువగా ప్రభావితం చేస్తుందనీ తేల్చారు.

# 'సంఘీ' భావం



# పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యమేల?

ప్రభుత్వం నిర్వహించే వివిధ పరీక్షలు విద్యార్థుల, అభ్యర్థుల భవిష్యత్తు, జీవితాలతో ముడిపడి ఉంటాయి. పరీక్షలు దగ్గరపడ్డాయంటే ఇటు పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు, ఇటు విద్యార్థులలో మానసిక ఆందోళన ఉంటుంది. తాము రాసే పరీక్షల ఫలితాలు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. పరీక్షల్లో తప్పితే లక్ష్యాలు దెబ్బతిని మానసికంగా కృంగిపోయే పరిస్థితి ఉంటుంది. ఇక పబ్లిక్ సర్వీస్ కమీషన్, యూనియన్ పబ్లిక్ సర్వీసు పరీక్షలు అంటే వాటికి మరింత ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. కష్టపడి డిగ్రీలు సంపాదించినప్పటికీ వారి విద్యార్హతకు సరితూగే ఉద్యోగాలు ప్రైవేటు రంగంలో లభించ డం లేదు. వెట్టి చాకిరీ మినహా సరైన వేతనాలు అందకపోగా కనీసం ఉద్యోగ భద్రత కూడా ఉండటం లేదు. ఈ తరుణంలో అత్యధిక శాతం మంది విద్యావంతులైన యువత ప్రభుత్వ ఉద్యోగాలపై మక్కువ పెంచుకుంటోంది. ఒకసారి ప్రభుత్వ ఉద్యోగం లభిస్తే జీవితానికి ఒక ధీమా లభించినట్లు ఉంటుంది. ఇందులో రాష్ట్రస్థాయిలో నిర్వహించే పబ్లిక్ సర్వీసు పరీక్షలకు మరింత ప్రాధాన్యత పెరుగుతోంది. పబ్లిక్ సర్వీసు కమిషన్ ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీల భర్తీకి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి అర్హులైన వారిని ప్రభుత్వానికి అంది స్తుంది. ఈ పరీక్షల్లో కెలా గ్రూప్‌ఒన్ పరీక్షలకు మరింత ఎక్కువ పోటీ ఉంటోంది. ఎందకంటే ఈ పోస్టులు అన్నీ ఎగ్జిక్యూటివ్ స్థాయిలో ఉండటంతో యువతీ ఈ ఉద్యోగాలను పొందడం జీవితాశయంగా పెట్టుకుంటారు. గ్రూప్‌ఒన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత పొందితే కమర్షి యల్ టాక్స్ అధికారులుగాను, రెవెన్యూ డివిజన్ అధికారులు గా, మున్సిపల్ కమిషనర్లుగా, పోలీసు శాఖలో డిఎస్‌పిలు వంటి స్థాయి ఉద్యోగాల్లో నియమితులు అయ్యే అవకాశం ఉంటుంది. అధికారం, దర్పం ఉన్న ఈ పోస్టుల కోసం యువత పరిధికి మించి శ్రమించి పరీక్షల్లో నెగ్గాలని కలలు కంటూ ఉంటారు. గ్రూప్‌ఒన్ ఉద్యోగాల్లో నియమితులైతే రిటైర్మెంట్ నాటికి, ఐఎఎస్, ఐపిఎస్, ప్రభుత్వ కార్యదర్శి స్థాయి వరకు ఎదిగే అవకాశం ఉంటుంది. ఇలాంటి పోస్టుల భర్తీకి పబ్లిస్ సర్వీసు కమిషన్ కూడా ప్రశ్నాపత్రాలను ఎంతో జాగ్రత్తగా, అభ్యర్థుల ప్రతిభ బయటపడే విధంగా రూపకల్పన చేస్తారు. ఈ ప్రశ్నలు ప్రధానంగా అభ్యర్థికి సబ్జెక్ట్‌తో పాటు ఇతర విషయాల్లో ఏమేరకు పరిజ్ఞానం ఉందన్న విషయాన్ని తేటతెల్లం చేస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే ఇటు అభ్యర్థులకు, అటు పరీక్షా నిర్వాహకులకు కూడా పరీక్షా కాలంగా చెప్పుకో వచ్చు. పరీక్షల నిర్వహణలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తారు. ప్రశ్నపత్రాల రూపకల్పన నుంచి ముద్రణ, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, అభ్యర్థుల ఎంపిక వంటి విషయాల్లో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే పరీక్షల నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించలేకపోతోంది. ముందుగా ఇంటర్మీడియట్ పరీక్ష పత్రాల రూపకల్పనలో తప్పిదాలు వస్తున్నాయి, ఆ తరువాత స్పాట్ వాల్యుయేషన్‌లో లోపాలు ఉంటున్నాయి. ఇవన్నీ వెరసి విద్యార్థుల జీవితాలను చీకటిమయం చేస్తున్నాయి. ఇదే విధానం గ్రూప్ 1 పరీక్షల్లో కూడా ఎదురౌతోంది. ఎంతో భద్రంగా ఉండాల్సిన గ్రూపు పరీక్షలకు చెందిన పత్రాలు అతి సులువుగా సిబ్బంది చేతికి అందుతున్నాయి. అక్కడి నుంచి మార్కెట్‌లోకి వచ్చి కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది. బయటి వ్యక్తులు ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తేనే గాని పబ్లిక్ సర్వీసు అధికారులు గుర్తించలేకపోతున్నారు. ఇదంతా పబ్లిక్ సర్వీసు అధికారుల కనుసన్నలలోనే జరుగుతోందని ఆరోపణలు కూడా ఉన్నాయి. కొందరు బడా రాజకీయవేత్తల అండ కోసం, వారి నుంచి వచ్చిన వత్తిడి కారణంగా ఇలాంటివి చోటు చేసుకుంటున్నా యన్న ఆరోపణలు ఉన్నాయి. పటిష్టమైన వ్యవస్థ ఉండాల్సిన పబ్లిక్ సర్వీసు కమిషన్‌లో పదవీవిరమణ చెందిన వారు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆధిపత్యం చలాయిస్తున్నారు. దీనితో త్వరగా చేతివాటం చేయడానికి అవకాశాలు కలుగుతున్నాయి. ఒక్క గ్రూప్ 1 ప్రశ్నపత్రాలే కాదు వరుసగా అన్ని పరీక్షల ప్రశ్నపత్రాలు స్టడీసెంటర్ల ద్వారా కోట్ల రూపాయలకు అమ్మకాలు జరిగాయని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇంకా చాలా విషయాలు వెలుగు చూడటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీల వెనుక బడాబాబుల హస్తం ఉండటంతో పరీక్షల రద్దు, తిరిగి నిర్వహణ అనే సిద్ధాంతంతో సరిపెట్టుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. విచిత్రం ఏమిటంటే నిందితులను పట్టుకుని పోలీసులు అరెస్టులు చూపిస్తున్నారే గాని దీనికి కారకులైన బోర్డు బాధ్యతుల జోలికి ప్రభుత్వం వెళ్లలేకపోతోంది.

గ్రూప్ 1తో సహా ఆరేడు పరీక్షల ప్రశ్నపత్రాలు లీకేజీలు జరిగినా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలులేవు. ప్రస్తుతం బయోమెట్రిక్‌ను పక్కన పెట్టి గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి హైకోర్టు ముందు తలొంచుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఒకపక్క ఉద్యోగాలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువతకు ఇలాంటి అవకతవక పరీక్షల నిర్వహణ మరింతగా కృంగదీస్తోంది. ఇకనైనా ప్రభుత్వ అస్మదీయులను పక్కనపెట్టి పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# మహిళకు పట్టం

కవర్ స్టోరీ

**సుంకవల్లి సత్తిరాజు**

అవకాశాలు భ్రమల్లో నుంచి జనించవు. ఊహాలోకం నుంచి ఉద్భవించవు. మన ఆలోచనలు ఉన్నతంగా సాగాలి. ఉన్నతమైన భావాలకు జీవమొచ్చి, చైతన్యవంతమై కదం తొక్కితే, చిత్తశుద్ధితో పోరాట పటిమను ప్రదర్శిస్తే అలాంటి పోరాటాల ఫలితాలు అత్యంత స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. ఆశించిన ఫలితాలు ప్రాప్తించాలంటే ఆలోచనలు అత్యంత ప్రగతిదాయకంగా ఉండాలి. అలాంటి ఆలోచనలకు రెక్కలు వచ్చి ఎగరాలి. మనం పయనించే మార్గంలో ఎన్నో అవరోధాలుంటాయి. బెదిరింపులుంటాయి, బుజ్జగింపులుంటాయి. మనం నడిచే మార్గాన్ని తప్పించే మాయోపాయాలుంటాయి. ఎక్కే నిచ్చెనను పడదోసే కుతంత్రాలుంటాయి. ఇలాంటి అవరోధాలను అవలీలగా అధిగమించలేం. మన ఆలోచనలు బలంగా నాటాలి. ఆలోచనలను ఆచరణలో సుసాధ్యం చేయడానికి చిత్తశుద్ధి, దృఢసంకల్పం అవసరం. ఆశావహ దృక్పథంతో అనుకున్న లక్ష్యానికి చేరువకావాలి. స్వార్థంతో అవకాశాలను చేజార్చుకుంటే, మనం చేసే మరో ప్రయత్నం మహాకఠినంగా ఉంటుంది. మహిళలకు కేంద్ర, రాష్ట్ర చట్టసభల్లో ప్రాతినిధ్యానికి ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇందుకు చక్కని ఉదాహరణ. ఈ బిల్లు ఆమోదంలో దశాబ్దాల తరబడి కాలయాపన జరిగింది. ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. ఈ ప్రతిబంధకాలన్నీ ఎట్టకేలకు తొలగిపోయి నారీలోకం విజయ దుందుభి మోగించింది. 128వ రాజ్యాంగ సవరణ ఆమోదం ద్వారా 'నారీశక్తి వందన్ అధినయమ్' రూపంలో తమకందివచ్చిన మహత్తర అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని మహిళాసాధికారతకు నిజమైన నిర్వచనం చేకూర్చుందుకు కృషి చేయాలి. వ్యక్తిగత లబ్ధికోసం కాకుండా దేశ ప్రయోజనాల కోసం మహిళలు తమ రాజకీయ అధికారాన్ని వినియోగించాలి. తోటి మహిళలను ప్రోత్సహించాలి. తమ రాజకీయ ఎదుగుదలను సమాజహితంతో ముడిపెట్టాలి. మగువలు మనుగడకు మూలాధారం. ఆకాశంలో సగం, సృష్టికి వరం. పడతి ప్రకృతికి ప్రతీక. ఇంతి ఇలలో దైవం, జగతికి ప్రాణం, శిలలో, శిల్పంలో, కవి కలంలో, కమ్మని కావ్యంలో రమణీయంగా వర్ణించబడుతున్న 'స్త్రీ' కేవలం కవుల వర్ణనలకు, కృత్రిమ పొగడ్తలకే పరిమితం కారాదు. మహిళల వాస్తవ జీవితాన్ని, వారి జీవిత గమ్యంలో తొంగిచూస్తున్న ఆవేదనలను స్పృశించగలగాలి. విశ్లేషించగలగాలి. స్త్రీల సాధక బాధకాలను గమనించాలి. పరిష్కారమార్గాలు అన్వేషించాలి. శూన్యాకాశంలో సగంగా వర్ణించడం కాదు. అతివలకు సమస్త జగతిలో విశిష్టస్థానం కల్పించాలి. 'యత్ర నార్యస్తు పూజ్యంతే-రమంతే తత్రదేవతాః !!' అని స్తుతించడం కాదు, స్త్రీలను బానిసలుగా కాకుండా, బంగారు భవితకు దివ్వెలుగా గుర్తించాలి. చైతన్యమున్న మానవ జాతికి మణిహారంలా భావించి, గౌరవించాలి. జీవితాంతం తమ అడుగులకు మడుగులొత్తుతూ, పురుషులపై ఆధారపడి జీవించమనడం సరికాదు, మగువల నిజమైన ప్రగతికి బాటలు వేయాలి. వారి వ్యక్తిత్వానికి విలువనివ్వాలి. జాతికి జవసత్వాలు కలిగించాలి. దేశ పురోభివృద్ధికి సహకరించాలి. స్త్రీలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తోడ్పాటునందించాలి. ఎక్కడైతే స్త్రీలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంలో విఫలమౌతారో, ఎక్కడైతే స్త్రీలు విద్యకు, ఉద్యోగావకాశాలకు దూరంగా నెట్టబడతారో, అక్కడ ప్రగతి గతి తప్పి, తిరోగమనంలో పయనిస్తుంది. ఎక్కడైతే అతివలు ఆర్థిక స్వాతంత్ర్యానికి దూరమౌతారో అక్కడ బానిసత్వమనే అమానుష క్రీడకు అంకురార్పణ జరుగుతుంది. పూర్వకాలంలో అనేక దేశాల్లో స్త్రీలు అన్నిరకాలుగా అణగద్రొక్కబడేవారు. ప్రాచీన భారతీయ సమాజంలో కూడా ఒకవైపు స్త్రీని పూజిస్తూనే, మరోవైపు అబలంగా, పరాధీనగా అభివర్ణిస్తూ, కట్టుబాట్ల పేరుతో స్వేచ్ఛను హరించి, పురుషులపై ఆధారపడేవిధంగా తయారు చేసి, జీవితాంతం కట్టుబానిసలుగా చూసేవారు. స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం తర్వాత కూడా అనేక దశాబ్దాలు స్త్రీని సాంప్రదాయబద్ధమైన శృంఖలాల్లో బంధించి, ఇంటికి ఇల్లాలిగా,

ఇంట్లోవారి యోగక్షేమాలకు కనురెప్పగా, పిల్లలను కనే యంత్రంలా, వంటింటికే పరిమితం చేయడం జరిగింది. సాంప్రదాయపు కట్టుబాట్లు కొనసాగుతున్న తరుణంలోనే అనేకమంది భారతీయ మహిళలు ఎంతో ధైర్యసాహసాలతో ముందుకొచ్చి, అనేక రంగాల్లో తమ ప్రతిభను చాటారు. ఇందిరాగాంధీ, సరోజినీనాయుడు, అరుణాఅసఫాలీ, విజయలక్ష్మి పండిట్, సుచేతా కృపలానీ, దుర్గాభాయ్ దేశ్‌ముఖ్, సావిత్రిభాయ్‌పూలే తదితరులు దేశానికి ఒక దశాదిశ నిర్దేశనం చేసారు. అంతకుపూర్వం ఝాన్సీలక్ష్మీభాయ్, రుద్రమదేవి వంటి మగువలు తమ శక్తి సామర్థ్యాలను చవిచూపించారు.

ఇంతటి మహోన్నతమైన చరిత్రగల మహిళాప్రపంచంలో భారత దేశంలోని మహిళలు చూపిన తెగువ, వారి ప్రతిభ, సవజం పట్ల వారు ప్రదర్శించిన అంకితభావం చిరస్మరణీయం. సమాజం వీరిని గౌరవించింది. జేజేలు పలికింది. ఇలాంటి మహిళలు రాణించడానికి వారి కుటుంబ నేపథ్యంతో పాటు, వారిలోని ప్రతిభ, తెగువ కుటుంబపరంగా వారికి లభించిన ప్రోత్సాహమే కారణం. ఆనాటి భారతీయ సమాజంలో నిరక్షరాస్యత అధికం. అందునా మహిళల అక్షరాస్యత స్వల్పం. ఈ కారణంగా పలువురు మహిళలు అక్షరాస్యత లేక, కుటుంబ వ్యవస్థలో చోటుచేసుకున్న కొన్ని సాంప్రదాయ పద్ధతుల వలన కేవలం ఇంటికే పరిమితమై తమ అస్తిత్వాన్ని కోల్పోయారు. పురుషుల నీడలో ఎదగలేక వెనకబడిపోయారు. స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడమే దీనికి కారణం. స్త్రీలు రాజకీయంగా ఎదగలేకపోయారు. ఇలాంటి



పరిస్థితుల్లో మహిళలకు రాజకీయ అధికారం దక్కాలని, చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరగాలనే డిమాండ్ బయలుదేరింది. అయితే సరోజినీ నాయుడు వంటి మహిళలు మహిళా రిజర్వేషన్ల పట్ల విముఖత ప్రదర్శించినట్లు కొంతమంది భాష్యం చెబుతున్నారు. మహిళలు ఎవరి దయాదాక్షిణ్యాతో ఎదగరాదని, మహిళలు ఆత్మాభిమానంతో స్వయం శక్తిసంపన్నులు కావాలని భావించడమే సరోజినీనాయుడు సదుద్దేశ్యంగా అవగతం చేసుకోవాలి. మహిళలకు రిజర్వేషన్లనిచ్చి, వారి శక్తిసామర్థ్యాలను తక్కువ చేయకూడదనే భావన ఆమెది. ఏదిఏమైనా ఉన్న అవకాశాన్ని వినియోగించుకుని అంచెలంచెలుగా తమ రాజకీయ ఎదుగుదలకు మార్గం సుగమం చేసుకోకపోతే మహిళలు వెనకబడే ఉంటారన్న భావన మహిళా ప్రపంచంలో ప్రబలింది. ఈ కారణంగానే మహిళలకు చట్టసభల్లో ప్రవేశం జరిగింది. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో చట్టసభల్లో మహిళల ప్రాధాన్యత పెరగాలని భావించి మహిళల రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు జరిగాయి. స్థానిక సంస్థల్లో మొదట మహిళలకు రిజర్వేషన్ల ఔకర్యం కల్పించడం జరిగింది. ఆ తర్వాత దశాబ్దాల సుదీర్ఘనిరీక్షణ అనంతరం ఎట్టకేలకు మహిళల రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటు ఆమోదం పొందింది. ఆమోదం సరే ఆచరణ మాటేమిటి అనే మీమాంస కలగడం సహజం. అన్నిప్రశ్నలకు త్వరలోనే సమాధాం లభిస్తుంది. ఏదిఏమైనా నారీశక్తిపై కమ్ముకున్న మబ్బులు తొలగిపోయి, పండు వెన్నెల ప్రసరించిందనే భావించారు. ఈ సందర్భంగా మహిళలపై కొనసాగుతున్న వివక్షత గురించి, మహిళల శక్తియుక్తుల గురించి, పలు దేశాల చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం గురించి, మహిళల రాజకీయాధికారం కోసం సాగిన ఉద్యమాల గురించి, కొన్ని దేశాల్లో మహిళలను రాజకీయ అధికారానికి దూరంగా ఉంచడానికి సాగుతున్న కుతంత్రాల గురించి, భవిష్యరాజకీయ యవనికపై మహిళలు నిర్వర్తించవలసిన క్రియాశీలక భూమిక గురించి, చట్టసభల్లో మహిళల బాధ్యత గురించి కూలంకషంగా విశ్లేషణ జరగాలి. నాగరికత వికసిస్తున్న దశలో కూడా ప్రపంచంలోని పలు దేశాల్లో తీవ్రమైన లింగవివక్షత కొనసాగింది. 18,19వ శతాబ్దాల్లో కూడా ప్రపంచంలోని పలు దేశాలు మహిళలను ఓటు హక్కుకు దూరంగా ఉంచడం జరిగింది. యునైటెడ్ స్టేట్స్, గ్రేట్ బ్రిటన్, కెనడా, జర్మనీ తదితర దేశాల్లో కూడా మహిళలకు ప్రారంభదశలో ఓటు హక్కు లభించలేదు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికల వరకే మహిళలకు ఓటుహక్కు కల్పించి జాతీయస్థాయి ఎన్నికలకు మహిళలను దూరం చేసిన దేశాల చరిత్రను గమనించాలి. న్యూజిలాండ్‌ను మహిళలకు ఓటుహక్కు కల్పించిన మొదటి దేశంగా పేర్కొంటారు. కొన్ని దేశాల్లో మహిళలకు షరతులతో కూడిన ఓటు హక్కును మంజూరు చేస్తే, మరికొన్ని దేశాల్లో ఓటు హక్కు మంజూరు చేసినా, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించలేదు. భారతదేశ ఆంగ్లేయుల వలస పాలకుల నుండి స్వాతంత్ర్యం పొంది, నూతన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత మహిళలకు, పురుషులతో సమానంగా ఓటుహక్కు కల్పించడం జరిగింది. అయితే అంతకు ముందే కమలాదేవి ఛటోపాధ్యాయ ఎన్నికల్లో పోటీచేసిన భారతీయ తొలి మహిళాగా చరిత్రలో స్థానం సంపాదించింది. ప్రస్తుత భారత జనాభా అనధికార అంచనాల ప్రకారం 143కోట్లు. ఇందులో ఆడవారి జనాభా సుమారు 69కోట్లు. భారతదేశం మొత్తం జనాభాలో ఇది 48.4శాతం. ఇంత జనాభా గల దేశంలో దాదాపు సగం జనాభా గల స్త్రీకు చట్టసభల్లో సముచిత స్థానం లభించడం లేదు. పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యానికి సంబంధించి 193 దేశాలలో భారతదేశం 144వ స్థానంలో ఉంది. పార్లమెంటు ఉభయసభల్లో ఇప్పటివరకు 7500మంది ప్రాతినిధ్యం వహించారు. ఇందులో మహిళలు కేవలం 600 మంది మాత్రమే. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కూడా మహిళల ప్రాతినిధ్యం కోసం పోరాటాలు జరిగినా 1970లో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. 1971లో ఐక్యరాజ్యసమితి మహిళల స్థితిగతులు, వారి ప్రాతినిధ్యంపై చేసిన అభ్యర్థన ప్రకారం 1975లో కేంద్ర విద్యా, సాంఘిక సంక్షేమ మంత్రిత్వశాఖ దేశంలోని మహిళల పరిస్థితి, విద్య, న్యాయ, పరిపాలనా సంబంధిత వివరాలపై పరిశీలనకు, అధ్యయనానికి ఒక కమిటీని (సిఎస్‌డబ్ల్యూఐ) నియమించింది. గీతా ముఖర్జీ నాయకత్వంలోని పార్లమెంటు సంయుక్త కమిటీ చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యంపై పలు సూచనలు చేసింది. ఆ కమిటీ సూచన మేరకు 1996లో మొట్టమొదట పార్లమెంటులో మహిళాబిల్లు ప్రవేశపెట్టారు. భారతదేశంలో ఎంతోమంది మహిళలు అనేక అవరోధాలు ఎదురౌతున్నాయి. ఇలాంటి పరిస్థితులు చాలా దేశాల్లో వివిధ రకాలుగా ఉన్నాయి. కొన్ని దేశాల చట్టసభల్లో మహిళల ప్రాధాన్యత పెరుగుతున్నది. తూర్పుఆఫ్రికా దేశమైనా రువాండా చట్టసభలో మహిళల ప్రాతినిధ్యం అధికంగా ఉంది. ఇక్కడ పార్లమెంటులో 60శాతంమంది మహిళలే కావడం విశేషం. 2008వ సంవత్సరంలో 'రువాండా' మెజారిటీ మహిళా

ప్రాతినిధ్యం గలదేశంగా గుర్తించబడింది. క్యూబా, బొలీవియా దేశాలు 53శాతంతో, మెక్సికో, గ్రెనడా, నికారాగ్వా దేశాలు 45 శాతానికి పైగా మహిళా ప్రాతినిధ్యం కలిగిఉన్నట్లు కొన్ని నివేదికల వలన తేటతెల్లమౌతున్నది. నబీబియా సుమారు 46శాతం, స్వీడన్ 46శాతం, దక్షిణాఫ్రికా 42 శాతంతో మహిళలకు చట్టసభల్లో అత్యంత ప్రాధాన్యత నిచ్చేవేశాలుగా పేరొందాయి. మహిళల హక్కులను కాపాడి, మహిళల కోసం అనేక చర్యలు చేపట్టి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వారి ఎదుగుదలకు సహక రించేవారిని స్త్రీవాదులు (ఫెమినిస్టులు)గా అలాంటి ప్రభుత్వాలను ఫెమినిస్ట్ ప్రభుత్వాలుగా పేర్కొంటారు. స్వీడన్ ప్రపంచంలో మొట్టమొదటి ఫెమినిస్ట్ ప్రభుత్వంగా స్వయంగా ప్రకటించుకుంది. అమెరికా పార్లమెంటును 'కాంగ్రెస్' అని పిలుస్తారు. అమెరికా కాంగ్రెస్ ఎగువసభ 'సెనెట్'లో 25మంది మహిళలున్నారు. అమెరిగా దిగవసభ 'హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్'లో మహిళా సభ్యులసంఖ్య 125. గత శతాబ్దకాలంతో పోల్చి చూస్తే, అమెరికా కాంగ్రెస్‌లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగిన మాట వాస్తవం. నెదర్లాండ్ చట్టసభలో మహిళల శాతం 40 పైగా ఉంది. స్వీడన్‌లో మహిళలకు విద్య, ఉపాధి, ఆరోగ్య సంరక్షణ, సాంఘిక భద్రత తదితర విషయాల్లో సమాన అవకాశాలున్నాయి. ఫ్రాన్స్, ఇటలీ, గ్రేట్ బ్రిటన్, యు.ఎస్, టర్కీ, డెన్మార్క్‌లు ఫెమినిస్ట్ దేశాలుగా చెప్పుకుంటున్నాయి. స్త్రీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత నివ్వడం, విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో అవకాశాలి వ్వడం, సమానత్వ సాధన కోసం ప్రయత్నించడం స్ఫూర్తిదాయకం. నేపాల్, తైవాన్ దేశాల చట్టసభల్లో కూడా మహిళల శాతం అధికంగానే ఉంది. భారతదేశంలో వేదకాలం నుండి స్త్రీలను గౌరవించే సాంప్రదాయముంది. అయితే అదే సందర్భంలో మహిళలపై అనేక విషయాల్లో తీవ్రమైన నిర్బంధాలు కొనసాగిన మాట వాస్తవం. వర్తమాన పరిస్థితులు మహిళలకు ఆశాజనకంగానే ఉన్నాయి. అయితే నేటికీ మహిళల పట్ల సమాజం అనుసరించే అణచివేత ధోరణి మారాలి. మహిళలను పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు సాగే విధంగా తోడ్పాటునందించాలి. స్వాతంత్ర్యానికి ముందే మహిళల హక్కులపై అనేక మంది పలు పోరాటాలు చేసారు. మహిళల అణచివేతకు వ్యతిరేకంగా నినందిం చారు. లింగభేదాన్ని నిరసించారు. ఆంగ్లేయుల కాలం నుండి మహిళలను రాజకీయాలకు దూరం చేసే కుట్ర జరిగింది. సమాన త్వ సాధన కోసం జరిపే పోరాటంలో మహిళల ఆత్మాభిమానం దెబ్బతినకూడదని కొంతమంది భావించారు. కొన్ని మహిళా సంఘాలు కూడా రిజర్వేషన్ల పేరుతో మహిళల స్వాతంత్ర్యాన్ని, ఆత్మాభిమానాన్ని పణంగా పెట్టకూడదని సూచించాయి. కేంద్ర చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని కొన్ని కమిటీలు తిరస్కరించాయి. తెల్ల దొరల ఏలుబడి అంతమైన తర్వాత భారతదేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగి, 1952 ఏప్రిల్ 17న మొదటి లోక్ సభ ఏర్పడింది. దేశంలో అప్పటి జనాభా సుమారు 37 కోట్లు కాగా, నాటి ఓటర్ల సంఖ్య కేవలం 17.32 కోట్లు. అప్పటి లోక్‌సభ స్థానాల సంఖ్య 489. ఇందులో మహిళా సభ్యులు కేవలం 24 మాత్రమే. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ రూపకల్పన కోసం ఏర్పడిన రాజ్యాంగ సభలో అనేక చర్చలు జరిగాయి. మహిళలను పురుషులతో సమానంగా చూడాలనే వాదనతో మహిళల రిజర్వేషన్ల ప్రక్రియ ప్రశ్నార్థకమైంది. అప్పటి నుండి నేటి వరకు మహిళల రిజర్వేషన్ల విషయంలో అనేక తర్జన భర్జనలు జరిగాయి. రాజీవ్‌గాంధీ, దేవెగౌడ, మన్మోహన్ సింగ్, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటివారు ప్రధాన మంత్రుల హోదాలో మహిళా బిల్లుకు కృషి చేసినా, కొన్ని పార్టీలు వ్యతిరేకించడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. పంచాయితీ రాజ్ వ్యవస్థలో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయిస్తూ ప్రవేశపెట్టిన బిల్లు 1989లో దిగువ సభ ఆమోదించినా ఎగువ సభలో మెజారిటీ లేక వీగిపోయింది. రాజీవ్‌గాంధీ మరణా నంతరం అధికారంలోకి వచ్చిన పి.వి.నరసింహారావు నాయకత్వం లోని కాంగ్రెస్ మైనారిటీ ప్రభుత్వం 1992లో పంచాయితీ రాజ్ సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. 1993లో అన్ని రాష్ట్రాల ఆమోదం పొందిం ది. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. దీనివలన 15 లక్షల మంది మహిళలు రాజకీయాల్లో ప్రత్యక్ష భాగస్వామ్యం వహిస్తున్నారు.



దేవెగౌడ నాయకత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో 81వ రాజ్యాంగ సవరణ ద్వారా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియకు 1996 సెప్టెంబరు 12వ తేదీన అంకురార్పణ గావించింది. సంకీర్ణ ప్రభుత్వంలోని వ్యతిరేకత వలన మహిళల రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందలేదు. ఆ తర్వాత 1998లో అప్పటి వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ కోసం ప్రయత్నించింది. లోక్‌సభలో గందరగోళం వలన మహిళల రిజర్వేషన్ల బిల్లు పడకేసింది. వాజ్‌పేయి ప్రభుత్వం తిరిగి ఎన్నిక కావడంతో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి విఫల ప్రయత్నం చేసింది. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యు.పి.ఏ. ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు కూడా లోక్‌సభలో ఏర్పడిన అవాంఛనీయ పరిణామాల వలన సాధ్యం కాలేదు. 2010వ సంవత్సరంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యు.పి.ఏ. సంకీర్ణ ప్రభుత్వ హయాంలో మహిళల రిజర్వేషన్లకు సంబంధించిన 108వ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. 2014వ సంవత్సరంలో లోక్‌సభ రద్దుతో ఈ బిల్లు ఆమోదం పొందలేదు. 2014వ సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ నాయకత్వం లోని బి.జె.పి. ఆధిపత్య ఎన్.డి.ఏ. ప్రభుత్వంపై విపక్షాలు వత్తిడి తెచ్చినా మహిళా రిజర్వేషన్ల బిల్లు ముందుకు కదలలేదు. అయితే నరేంద్ర మోడీ రెండవ సారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, మరోసారి లోక్‌సభ ఎన్నికలకు సంసిద్ధమౌతున్న తరుణంలో లోక్ సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళల ప్రాధాన్యత పెంచడానికి ఉద్దేశించిన "నారీ శక్తి వందన్ అధినియమ్ 2023" పేరుతో మహిళా బిల్లు నూతన పార్లమెంటు భవనంలో సునాయాసంగా ఆమోదం పొందింది. లోక్‌సభలో 454 మంది సభ్యుల మద్దతు తో, రాజ్యసభలో 214 మంది సభ్యుల మద్దతుతో



128వ రాజ్యాంగ సవరణ బిల్లు "నారీ శక్తి వందన్-అధినియమ్" అత్యధిక సభ్యుల మద్దతుతో 17వ లోక్‌సభలో ఆమోదం పొందడం, గతంలో మాదిరి వ్యతిరేకత కనిపించకపోవడం మహిళల పట్ల సమాజంలో వ్యక్తమౌతున్న సానుకూల స్పందనకు నిదర్శనం. 2014, 2019లో మహిళల బిల్లు తెస్తామని బి.జె.పి. చేసిన వాగ్దానం నెరవేరడంతో సుదీర్ఘ కాలం జాప్యం జరిగినా ఎట్టకేలకు తన వాగ్దానం నెరవేర్చుకోవడం హర్షదాయకం. 128వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం వలన ప్రస్తుతమున్న నియోజక వర్గాల ప్రాతిపదికన చూస్తే మహిళల ప్రాతినిధ్యం 181కి పెరుగుతుంది.

లోక్‌సభ, రాష్ట్ర చట్టసభల్లో 33 శాతం మంది మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఆమోదం పొందిన ఈ బిల్లు వలన 15 సంవత్సరాల పాటు మహిళలు రాజకీయంగా లబ్ధి పొందుతారు.

రాజ్యసభకు, శాసన మండళ్లకు ఈ రిజర్వేషన్లు వర్తించవు.

నియోజక వర్గాల డీ లిమిటేషన్ తర్వాత 2029 నుంచి మహిళల రిజర్వేషన్లు అమలవుతాయని తెలుస్తున్నది. అయితే అతితక్కువ స్థానాలున్న కేంద్రపాలిత ప్రాంతాల్లో మహిళల రిజర్వేషన్ల విభజన ఎలా జరుగుతుందో వేచి చూడాలి. 1వ లోక్ సభ కేవలం 24 మంది మహిళా సభ్యులకే పరిమితమైన ప్రస్తుత 17వ లోక్ సభలో మహిళల సంఖ్య 82కు పెరిగింది. సుమారు 70వ సంవత్సరాల సుదీర్ఘ లోక్ సభ చరిత్రలో మహిళల ప్రాతినిధ్యం పెరుగుదల అత్యంత స్వల్పం అని చెప్పక తప్పదు. గత 16వ లోక్ సభలో 78 మంది మహిళా సభ్యులుంటే, ప్రస్తుత 17వ లోక్ సభలో 82 మంది మహిళలు, రాజ్యసభలో 31 మహిళలు ఉన్నారు. మొత్తం 543 లోక్ సభ సభ్యుల సంఖ్యలో ఇది 14.3 శాతం మాత్రమే. రాజ్యసభలో మహిళలు కేవలం 14 శాతం. ప్రస్తుతం చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం గల రాష్ట్రాలైన చత్తీస్‌గఢ్ 14 శాతం, పశ్చిమ బెంగాల్ 13 శాతం, జార్ఖండ్ రాష్ట్రం 12 శాతం మహిళా సభ్యుల ప్రాతినిధ్యం కలిగి ఉన్నాయి. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా తదితర రాష్ట్రాల్లో మహిళల ప్రాతినిధ్యం 10-12 శాతం మధ్య ఉంది. కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో మహిళల ప్రాతినిధ్యం రెండంకెల స్థాయికి దాటలేదు. స్త్రీ, పురుషుల మధ్య లింగ వివక్షత అర్థ రహితం. లింగభేదం లేకుండా స్వేచ్ఛగా జీవించడమే నిజమైన నాగరికం-ఆధునికం. అదే మానవత్వం. ఒకరిని అణచివేసి, మరొకరు పైశాచికానందం పొందడం ఆధునిక మానవ సమాజంలో నెలకొన్న వికృత ఆలోచనలకు ప్రతిరూపం. మానవులకున్న ఆలోచనా శక్తి, విచక్షణ ఇతర జంతువుల్లో కానరాదు. ఈ కారణంగానే మనిషి బుద్ధిజీవిగా భూమిపై మనుగడ సాగిస్తున్నాడు. మానవులకున్న ప్రత్యేక లక్షణాల వలన జంతువుల నుండి వేరు చేయబడి ప్రత్యేకతతో మనగలుగుతున్నాడు. స్వేచ్ఛ జన్మతః ప్రాప్తించిన హక్కు. ఇలాంటి హక్కులను సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు వంటి వాటితో హరించడం క్షంతవ్యం కాదు. లింగ వివక్షత కారణంగా శతాబ్దాల తరబడి స్త్రీ స్వాతంత్ర్యం హరించబడింది.

ఎన్నో తరాల మహిళల జీవితాలు నిర్బంధాల మధ్య నలిగిపోయి కాలగర్భం లో కలిసిపోయాయి. మహిళల జీవితాలు అర్థంలేని విధంగా, వారి పుట్టుకకు సార్థకత సమకూర్చలేని పలు నిర్బంధాలు ఎదురౌతున్న నేపథ్యంలో ఎన్నో ఉద్యమాలు మహిళల శ్రేయస్సు కోసం కొనసాగాయి. ఆర్థిక స్వాతంత్ర్యం కోసం, సాంఘిక, రాజకీయ సమానత్వం కోసం, స్వేచ్ఛ కోసం ఎన్నో గొంతులు ఎలుగెత్తాయి. మహిళలపై అణచివేత కొనసాగింది. పోరాటమే హక్కుల సాధనకు ఏకైక మార్గమని భావించిన స్త్రీ ఎన్నో విజయాలు సాధించింది. రాజకీయ అధికారం కోసం ఉద్యమించింది. మహిళలు మన దేశంలో కీలకమైన పదవులు అధిరోహించినా, చట్టసభల్లో పురుషుల ప్రాతినిధ్యం, ఆధిపత్యం అత్యధికంగా ఉంది. ఇలాంటి పరిస్థితులను అధిగమించి, మహిళలు రాజకీయంగా ఎదగాలంటే చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం పెరగడమే మార్గమన్న అభిప్రాయం ప్రబలింది. ఈ ఆలోచనల నుండి పుట్టిందే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల డిమాండ్. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్ల కోసం ఎన్నో ఉద్యమాలు జరిగాయి. మహిళల రాజకీయ ఎదుగుదలకు ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. కొన్ని రాజకీయ పక్షాలు, కొంతమంది వ్యక్తులు చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని వ్యతిరేకించారు.

యు.పి.హయాంలో

హయాంలో మహిళల బిల్లు ఆమోదం పొందుతుందని ఆశించినా నిరాశే ఎదురయ్యింది.



ఆ తర్వాత బి.జె.పి. నేతృత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం 2014, 2019 సంవత్సరాల్లో అధికారంలోకి వచ్చినా కొద్ది మంది వ్యక్తులు, పార్టీలు ఈ బిల్లు విషయం ప్రస్తావించినా ప్రయోజనం లేకపోయింది. రాజకీయ పక్షాలకు ఓట్లు, అధికారం ముఖ్యమన్న ప్రాథమిక సత్యాన్ని విస్మరించలేం. ఏది ఏమైనప్పటికీ ముంచుకొస్తున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ లబ్ధికోసం నారీ వందనం అంటూ కేంద్ర, రాష్ట్ర చట్టసభల్ల మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ బిల్లు ఆమోదించారంటూ ప్రతిపక్షాల నుండి ఆరోపణలు వస్తున్నా, స్వపక్షం, విపక్షం అనే వ్యత్యాసం లేకుండా నారీ శక్తిని గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్ నెరవేర్చడం ముమ్మాటికీ మహిళల విజయం. మహిళల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. సుమారు మూడు దశాబ్దాల పోరాటం తర్వాత మహిళల బిల్లుకు మోక్షం లభించింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళల గొంతు వినిపించే సువర్ణావకాశం దక్కింది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో మహిళల రిజర్వేషన్ల బిల్లు 2024 సార్వత్రిక ఎన్నికల్లో అమలుకు నోచుకోవడం దాదాపు అసాధ్యం.




దేశ వ్యాప్తంగా జనగణన జరగకుండా, నియోజక వర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) జరగకుండా ప్రస్తుత బిల్లును అమల్లోకి తీసుకురావడం కష్టం. ప్రతీ పది సంవత్సరాలకు ఒకసారి జరిగే దేశ జనగణన 2021లో జరగలేదు.

జనగణనతో సంబంధం లేకుండా, గత 2011 జనాభా లెక్కల ప్రకారం, ఇప్పుడున్న లోక్‌సభ, రాష్ట్రాల స్థానాల్లోనే మహిళలకు 33 శాతం సీట్లు కల్పించేందుకు ఏదైనా నిర్ణయం జరగాలి. లేకుంటే 2029 సార్వత్రిక ఎన్నికల వరకు మహిళా రిజర్వేషన్ల బిల్లు అమలుకు నోచుకోజాలదు. ఏది ఏమైనప్పటికీ మహిళల కోసం ఒక ముంద డుగు పడింది. మహిళల చిరకాల వాంఛ నెరవేరింది. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న తరుణంలో రాజకీయ రంగంలో కూడా మరింతగా చురుకైన పాత్ర వహించడానికి వీలు కలిగింది. ఆకాశంలో అర్ధభాగం అంటూ మహిళలను కీర్తించినా, కనీసం చట్ట సభల్లో ప్రతీ ముగ్గురిలో ఒక స్త్రీకి స్థానం కల్పించి, మహిళా గళాన్ని ఘనంగా వినిపించే మహత్తర అవకాశం లభించింది.

## ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటం

ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది మహిళలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించారు. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగకుండా అవరోధాలు కల్పిస్తున్నారని, అనేక నియమ నిబంధనలతో స్త్రీ జాతిని కేవలం నాలుగు గోడలకే పరిమితం చేస్తున్నారని, కుటుంబ క్షేమానికే మగువలు తమ జీవితాలను త్యాగం చేస్తున్నారని, స్వేచ్ఛను మరిస్తూ బాహ్య ప్రపంచాన్ని స్త్రీకి దూరం చేస్తున్నారని, శారీరకంగా, మానసికంగా హింసిస్తూ, స్త్రీల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన చెందుతూ, గళమెత్తి గర్జించి ప్రపంచానికి తమ ఆవేదనా స్వరాలను సమర్థవంతంగా వినిపించారు. మహిళల కోసం ఎన్నో వేదికలు ఏర్పడ్డాయి. మహిళల సమస్యలపై అనుకూల స్పందన లభించింది. గతానికి, వర్తమానానికి పురుషుల దృక్పథంలో ఎంతో మార్పు వచ్చింది. స్త్రీలకు ఇంకా పూర్తి స్థాయిలో స్వేచ్ఛ లభించకపోయినప్పటికీ, కొంతవరకు న్యాయం జరిగిన మాట వాస్తవం. అయినా పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో స్త్రీల పట్ల, బాలికా విద్య పట్ల తీవ్ర వివక్ష కొనసాగుతున్నది. ఆఫ్ఘన్‌లో తాలిబన్ల అరాచకం పునరావృతమైంది. మయన్మార్‌లో సుదీర్ఘ కాలం నిర్బంధించబడి, విడుదలై ఎన్నికల్లో విజయం సాధించిన నోబెల్ బహుమతి విజేత "ఆంగ్ సాన్ సూకీ"ని అక్కడి సైనిక పాలకులు తిరిగి నిర్బంధంలోకి తీసుకుని ప్రజాస్వామ్య హక్కులను, మానవ హక్కులను కాలరా యడం జరిగింది. చరిత్రలో సుదీర్ఘమైన చీకటి అధ్యాయానికి



సూకీ ఉదంతం ఒక మచ్చుతునక. మహిళల పట్ల తీవ్రమైన వివక్ష కొనసాగిన తరుణంలో పాక్‌లో బెనజీర్ భుట్టో ప్రధాన మంత్రిగా పని చేసి, ఆ తర్వాత కాలంలో హత్య చేయబడ్డారు. బేగం ఖలేదా జియా బంగ్లాదేశ్‌లో మిలటరీ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఆ దేశానికి మొదటి మహిళా ప్రధానిగా పని చేసారు. ఖలేదా జియా రాజకీయ ప్రత్యర్థి ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తన సమర్థవంత మైన నాయక త్వంతో ప్రపంచానికి మహిళల సత్తా చాటి చెప్పారు. శ్రీలంక ప్రధానిగా 34 సంవత్స రాల సుదీర్ఘ కాలం పని చేసిన సిరిమావో బండారు నాయకే ప్రపంచంలో మొట్టమొదటి మహిళా ప్రధానిగా చరిత్ర సృష్టించారు. చంద్రికా కుమార తుంగ శ్రీలంకకు అధ్యక్షురాలిగా పని చేసి సమర్థవంతమైన మహిళగా ఖ్యాతి గడించారు. మన దేశానికి చెందిన ఇందిరా గాంధీ భారత రాజకీయ యవనికపై కీలక పాత్ర పోషించి, నెహ్రూ తర్వాత అత్యధిక కాలం భారతదేశానికి ప్రధానిగా పని చేసి, దేశానికి మూడో ప్రధానిగా, మొదటి మహిళా ప్రధానిగా అధికార పగ్గాలు చేపట్టి మహిళల సత్తా ఏమిటో నిరూపించారు. హిల్లరీ క్లింటన్ అమెరికా రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. కమలా హారిస్ ప్రస్తుత అమెరికా ఉపాధ్యక్షురాలిగా పని చేస్తూ మహిళలు రాజకీయాల్లో విశేషంగా రాణించగలరని నిరూపించారు.

**(మిగతా 19వ పేజీలో)**

# చూపులేని వారికి స్మార్ట్ విజన్ కళ్లద్దాలు

పుట్టుకతోనో, లేక ఏదైనా ప్రమాదంలోనో చూపు కోల్పోయినవారు ప్రస్తుతం బ్రెయిలీ భాషసాయంతో ఎంతోకొంత చదవగలుగుతున్నారు. కాకపోతే, మామూలు భాషలో ఒకపేజీలో చెప్పాల్సిన విషయాన్ని బ్రెయిలీలో రాయాలంటే ఆరుపేజీల దాకా అవుతుంది. కాబట్టి, వాటి ఖర్చు ఎక్కువ. ఈ కారణం వల్లనేమో మనదేశంలో 18 లక్షలమంది అంధులుంటే కేవలం 20శాతం మాత్రమే బ్రెయిలీ చదివేవాళ్లున్నారట. అది చదవలేనివాళ్లకి




ఈ స్మార్ట్ విజన్ కళ్లద్దాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. దీన్ని ధరించినవాళ్లు తమ ముందు ఏదైనాపుస్తకాన్ని తెరిస్తే చాలు కళ్లద్దాలే దాన్ని చదివి వినిపిస్తాయి. తెలుగు, ఇంగ్లీషు, తమిళం ఇలా 73 భాషలనీ చదివేస్తాయి. ఇంగ్లీషు కూడా ఏ అమెరికన్ ఉచ్చరణతోనో కాకుండా 'ఇండియన్ ఇంగ్లీష్'తోనే వినొచ్చు. ప్రస్తుతం దీన్ని వాడుకున్న అంధవిద్యార్థులు ఇదివరకటికన్నా పరీక్షల్లో మెరుగయ్యామని చెబుతున్నారు. ఇక ఈ కళ్ళద్దాలని ధరించి అంధులు ఏ భయమూ లేకుండా నడవొచ్చు. నడిచేటప్పుడు ఎదురుగా ఉన్న వస్తువుల గురించి హెచ్చరించడమే కాదు దాన్నుంచి పక్కకు తప్పుకోవడానికి ఎన్ని అడుగులు వేయాలో, ఏవైపున వెళ్లాలో ఎక్కడ ఆగాలో కూడా చెబుతుంది. అంతేకాదు, మనం ఎక్కడికైనా వెళితే చుట్టుపక్కల ఏయే వస్తువులున్నాయో క్షుణ్ణంగా వివరిస్తుంది. మన దగ్గరకి ఎవరైనా వస్తే..వాళ్ల ఆడామగా వయసు ఎంత ఉండొచ్చు అన్నదీ చెబుతుంది. ముఖ్యంగా, అలా మాట్లాడినవాళ్ల పేరూ, ఊరినీ 'సేవ్' చేసుకునే వెసులుబాటూ ఇందులో ఉంది. తర్వాతెప్పుడైనా ఆ వ్యక్తి తారసపడితే 'మీ ఫ్రెండ్ కనిష్క వస్తున్నాడు!' అని చెబుతుంది.

## ఇలా ఉంటుంది

ఈ కళ్లద్దాల ఎడమవైపున కణతకి ఆనుకుని ఉండేలా అతిచిన్న పెట్టెలాంటి పరికరం ఉంటుంది. అందులో ఐదు మీటలుంటాయి. వాటిని నొక్కడం ద్వారా చదవడం, నడవడం, చుట్టుపక్కల ఉన్నవేమిటో తెలుసుకోవడం, మనుషుల్ని గుర్తించగలగడం అనే నాలుగు ఆప్షన్స్ ఎంచుకోవచ్చు. ఈ నాలుగుతోపాటూ 'స్టాండ్ బై' మోడ్‌పేరుతో మరో మీట ఉంటుంది. దీన్ని నొక్కాకే మిగతావాటిని ప్రెస్ చేయాలి. ఈ పెట్టెలాంటి పరికరంలో అతిచిన్న 'హెచ్‌డీ' కెమెరా, లైట్‌తో పనిచేసే రాడార్ (లిడార్) ఉంటాయి. మనం చదవడానికీ, మనమున్న ప్రదేశాన్ని గుర్తించడానికీ ఇవి ఉపయోగపడతాయి. ఈ కళ్లజోడుతోపాటూ మెడలో వేసుకునే ఓ బ్లూటూత్ స్పీకర్ కూడా ఉంటుంది. ఆ పెట్టే, ఈ స్పీకర్ రెండూ దీనికి సంబంధించిన మొబైల్ ఆప్‌తో అనుసంధానమై ఉంటాయి. కెమెరా, రాడార్ అందుకున్న సిగ్నల్స్ ముందుగా ఈ 'ఆప్'కి వెళతాయి. అందులోని కృత్రిమ మేధస్సు (ఏఐ) అప్పటికప్పుడు దాన్ని ప్రాసెస్ చేసి..బ్లూటూత్ స్పీకర్‌కి విషయాన్ని చేరవేస్తుంది. ఆ స్పీకరే అంధుల్ని నడిపించి, చదివించి, పరిసరాలని గుర్తించేలా చేస్తుంది. ఒక్క ఇంగ్లిషనే కాదు, తెలుగు సహా 14 భారతీయ భాషలూ, 11 ప్రపంచ భాషల్ని ఇది మాట్లాడుతుంది.

## ఆయనే ఆవిష్కర్త

ఈ ఆధునిక పరికరం ఆవిష్కర్త ముత్తంగి సీతారామ్. కాకినాడకి చెందిన ఆయన ఐఐటీ కాన్పూర్‌లో చదువుకుని భారత నౌకాదళంలో పరిశోధనాభివృద్ధి (ఆర్ అండ్ డి) విభాగంలో పనిచేశారు. ఆ తర్వాత అమెరికాలోని ఓ బహుళజాతి సంస్థలోనూ చేరారు. అప్పుడే ఓసారి వాళ్లక్కయ్యకి కంటిచూపు మందగించడం మొదలైందట. చెక్ చేస్తే షుగర్ కారణంగా కళ్లు దెబ్బతిన్నాయని చెప్పారట. చూస్తుండగానే ఆమె అంధురాలైంది. ఆ తర్వాత కొద్ది సంవత్సరాలకే చనిపోయింది. ఆ బాధ నుంచే 'స్మార్ట్ విజన్ కళ్లద్దాల ఆలోచన వచ్చిందంటారు సీతారామ్. అంధులు ప్రతిదానికీ పక్కవారిపైన ఆధారపడకుండా కొంతవరకైనా తమ పనులు చేసుకోవాలన్నదే దీని లక్ష్యమంటారాయన. మధురైలోని ప్రఖ్యాత అరవింద్ కంటి ఆసుపత్రిలో క్లినికల్ టెస్టులు చేసి గత ఏడాది దీన్ని లాంఛనంగా మార్కెట్‌లోకి తీసుకొచ్చారు సీతారామ్. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఇటీల నిర్వహించిన 'ఆరోహణ' ఆవిష్కరణ పోటీల్లో ఈ కళ్లద్దాలకు మొదటి బహుమతి వచ్చింది.

హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి, సరోజినీదేవి కంటి ఆసుపత్రి అంధత్వం ఉన్నవాళ్లకీ వీటిని సిఫార్సు చేస్తున్నారు. ఇలా ఇప్పటిదాకా 2500 కళ్లజోళ్లని విక్రయించారు.



# మౌనం ద్రవించిన వేళ

శిశిర ఋతువు చెట్టుకింద
తుషార బిందువై కూర్చుంటాను
తపస్విలా కాదు
మనస్విలా-
గాలి దశావతారాలు
ప్రదర్శిస్తుంది!
నా చూపులు దీనుల్ని
స్పృశించి స్రవించి
కఠిన హృదయాల్ని
వీక్షించి ఆగ్రహించి
నాలో కొలువు!
కరుణ దయ
ఉద్ధృతై ఉప్పెనై
రాగద్వేషాలు
పుట్టెడు పుటకలై
నాలో గూడు కట్టి!
ఘర్మజల
శ్రమ సౌందర్యం
నిరంకుశ దార్ష్టికం
నాలో స్మృతులు!
పాదాలు పథమై
ప్రయాణం
గమనం
మార్గరహితమై
నాలో మేల్కొల్పు!
అన్నిటిని ఆకళించి
నా పెదాలు
కదులుతాయి
కొండకోనలు
ప్రతిధ్వనిస్తాయి
చూపు విశ్వదృష్టి
పాదాలు మహాపథం
చేతులు అక్షయం
గొంతు హిమజ్వాల!

**- అడిగోపుల వెంకటరత్నమ్**

## రెక్కలు

పక్షిగాని పక్షి
స్వాతంత్ర్యం
ఎగురుతుంది
స్వేచ్ఛగా./ జాతి
ఊపిరి/ జెండా
.....
మణికట్టుకి
తోరపుదారం
స్థైర్యానికి/ ఓ విశ్వాసం
ఉచ్ఛ్వాస నిశ్వాస
భరోసా.
.....
కొన్ని ప్రక్రియల్లా
రాజకీయాల్లో
వాగ్దానాలు
ఎడారిలో రాతలు.
.....
అధికార పార్టీకి
అంతా భక్తులే
ఓట్లు మాత్రం
ప్రతిపక్షాలకే
దీపశలభం
ప్రలోభం.
.....
దార్శనికత/ లక్ష్యసాధన
స్థితప్రజ్ఞత
ధీర లక్షణాలు
సింహం ఎక్కదు
మునగచెట్టు
.....
ఫిడేలు/ రాగాలతో
జత కల్సింది
కమాను
దీర్ఘాలు పోతూ
వాయులీనం

**ఉమ్మడిశింగు రాఘవరావు**




## మేఘమాల

ఆకాశంలో వేలాడుతూ
నిశ్శబ్దంగా నిర్దయగా
కదలడం మానేసింది
నల్లని ఆ మేఘమాల.
చెప్పేవారు లేకపోయె
తనకుగా తోచదాయె
అక్కడనే గంటలాయె
నిశ్చలంగా ఉండిపోయె.
ఎండలతో వేగిపోయి
గుండెలన్నీ మండిపోయి
ప్రార్థించిరి జనులంతా
వానజల్లు కురవాలని.
పొలాలన్ని బీట వారి
పంట లేక, బతుకు లేక
ప్రార్థించిరి రైతన్నలు
శోకముతో, మౌనముగా.
చల్లగాలి కాస్త వీచి
పద పద మనగానే
మనసు మారి, మెల్లగా
కదిలింది మేఘమాల.
జలజలమని వర్షం
అందరి యెదలో హర్షం
కరుణించె మేఘమాల
విరిజల్లు జగమంతా.

**- జి.వి.ఎన్.మూర్తి**

**ఈవారం కవిత్వం**

# పుస్తక సమీక్ష



## స్ఫూర్తిదాయకం..మస్తాన్‌వలీ చరిత్రపఠనం

ప్రముఖ పద్యకవి డా॥చేరెడ్డి మస్తాన్‌రెడ్డి విరచిత ఛందోబద్ధ పద్యకావ్యం 'శ్రీఅ'ఖండ'యోగి' తన ఖండయోగశక్తితో అనేక అద్భుతాలను ఆవిష్కరించిన మహాయోగి హజరత్ గుంటూరు కాలేమస్తాన్‌షావలియా జీవన రేఖల సమాహారం ఈ పొత్తం. 18వ శతాబ్దంలో జీవించివున్న మస్తాన్ షా వలియా జన్మప్రదేశం తమిళదేశమయినా ఎక్కువ కాలం గుంటూరులో నివసించిన కారణంగా గుంటూరు మస్తాన్‌గా ప్రసిద్ధికెక్కారు. షావలి అంటే రాజయోగి అని అర్థం. మతాతీత, కులాతీత భావనతో, సమత, మరియు సర్వజన శ్రేయఃకాంక్షతో ప్రపంచంలో శాంతిని పరిమళింపజేసిన మహాపురుషుడిగా మస్తాన్‌షా వలియాను కీర్తిస్తారు కవి. లోక కల్యాణమే ధ్యేయంగా ఆయన తన యోగవిద్యను ప్రయోగించారు. మస్తాన్‌షా వలియా కథ మహిమోపేతుడైన భక్తుడి చరిత్ర. శ్రీఅఖండ యోగి కావ్యం 371 పద్యాలతో మస్తాన్ అవధూతగా కీర్తించబడుతున్న మస్తాన్‌షా వలియా కథా సంగ్రహం, కావ్యం చివరలో గద్యరూపంలో అందరికీ అర్థమయ్యేరీతిలో అందించారు కవి. మస్తాన్ అవధూత, మక్కాయాత్ర, మరణానంతరం ఆయన సమాధి వివరాలు, దర్గానిర్మాణం దాని వైభవం, ఉరుసుమహోత్సవం, పీర్లపండుగ వేడుకలు (మొహరం) మొదలైన విశేషాలు వివరంగా విపులీకరించారు మస్తాన్‌రెడ్డి. మహానుభావుల జీవిత చరిత్రపఠన ఎప్పటికీ అందరికీ స్ఫూర్తిదాయకమే.

**(శ్రీఅ'ఖండ' యోగి, రచన: డా॥చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, వెల: రూ 150, ప్రతులకు: 'ఆనందవర్ధన', 11-6-1/39, నవోదయ నగర్, నరసరావుపేట)** **- రమణ వెలమకన్ని**




## 'పాట పుట్టుక-అలంకార శాస్త్రం'

కె. రామలక్ష్మణ్‌కు ఈ పుస్తకాన్ని రచయిత అంకితం చేశారు. పాతికేళ్ల క్రితం ఈ వ్యాసాలు ఓ ప్రముఖ పత్రికలో ప్రచురణై ప్రజాదరణ పొందాయి. ఇది సమాచార విజ్ఞానశాస్త్రం అంటూ ప్రముఖ వాగ్గేయకారుడు మాస్టార్జీ 'పాట నన్ను కన్న తల్లి' అంటూ గూడ అంజయ చక్కటి ముందుమాటలు రాసారు. శాస్త్రీయసంగీతం రాజ్‌స్థానాల్లో కొలువైతే..జానపదుల గుండె చప్పుడే 'పాట'.. వీటిని తులనాత్మకంగా విశ్లేషించిన రాములు అభినందనీయులు. ఈదేశ మూలవాసులు సుఖాన్ని, దుఃఖాన్ని పాటగానే వెలువరిస్తారు. పాట గురించి ప్రస్థావన రాగానే గుర్తుకొచ్చేది గద్దర్. ఆయన రాసిన 'తరగనిగని' ప్రతిపాటకుడు, పాఠకుడూ, సంగీత కారులందరి కరదీపిక. తెలుగు పల్లెకారులు, గిరిజన తెగలు పాడుకునే పదబంధాలైన (హమ్మింగ్) రేల, రేలరేల, జుంబక్, జుంబక్..అల్లోనేరేడల్లో-అల్లోనేరేడల్లో..లాంటివి గమనించాలి. భాష పుట్టకముందే పాట రూపుకట్టింది. భక్తి,రక్తి, వైరాగ్య, తత్వ, విషాద, హాస్యవినోద, వ్యంగ్య, శాంత, ధ్యాన, యోగ, వీర, కరుణ, భయ, బీభత్స, వాత్సల్యరసాలు తత్వాలు గలపాటలు విభిన్న సందర్భాల్లో సాంస్కృతిక పునరుజ్జీవన స్థితిగతుల్ని విశ్లేషించిన తీరు ప్రశంసనీయం.

**(పాట పుట్టుక, రచన: బి.ఎన్. రాములు, వెల: రూ250, ప్రతులకు: విశాల సాహిత్య అకాడమి, 201, సులేఖ గోల్డెన్ టవర్స్, 2-2-186/53/5, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**



## అనురక్తి కలిగించే గేయ మౌక్తికాలు

మాత్రా ఛందస్సు మాత్రమే పాటిస్తూ, గేయ కవిత్వంలో మౌక్తికాలను సృజిస్తున్నారు రచయిత తాళ్లపల్లి మురళీధర్ గౌడ్. చారిత్రక కథనాలు, వ్యాసాలు, గేయాలు, ఇంటర్వ్యూలు ఈ రచయిత ప్రత్యేకత. ఒక్కోచోట తమ కవిత్వంలో అంత్యప్రాసలు కూడా పాటిస్తారు. ఏది పాటించినా పాటించకపోయినను, వీరి కవితలు, సరళమైన భాష, మధురమైన భావనలతో ఒప్పారుతాయి. మచ్చుకు 'నందనవన బృందావని/ ఎందుకలవు? ఇంకెందున!/ చిందెడు శిశునగవులోన/ విందుచేయు వదనంలో' అంటారు. మరో చోట కుండలు చేసే కుమ్మరినుద్దేశించి 'మట్టిని నీకరములతో/ మణిదివ్వెగ మలచినావు! ఈ మృణ్మయ పాత్రలోన/ అమృతమ్మును నింపినావ!' అంటూ ప్రస్తుతిస్తారు. జీవిత సత్యాలను అన్వయిస్తూ వెలయించిన ఈ కవితను గమనిద్దాం. 'మనుజుల తిమిరపు నరకాకృతి/ మలిపి వేయదు సత్యోద్ధతి' అంటూ తాత్వికతను రుచి చూపుతారు. మరో చోట శ్రీశ్రీని అనుకరిస్తూ 'నేనుసైతం నిత్యనూతన/శక్తితో ఎలుగెత్తి పాడెద' అంటారు. తర్వాత కాలంలో 'పుస్తకశిల్పి' బిరుదు తెచ్చుకున్న ఈ రచయిత, సామాన్య లకంటికి కనబడని సత్యాలను ఉటంకిస్తారు. 70 ఏళ్లప్రాయంలో కూడా గౌడ కలం తన బలంపోగొట్టుకోలేదు. అందుకే పలు తెలుగు సంస్థలు పలు బిరుదులిచ్చి తమ సాహితీసౌశీల్యాన్ని ప్రకటించుకున్నాయి.

**(గేయమౌక్తికాలు, రచన: తాళ్లపల్లి మురళీధర్‌గౌడ్, వెల: రూ 150, ప్రతులకు: అన్ని పుస్తకశాలలు)** **- కూర చిదంబరం**



## యన్.వి.ఆర్.స్మృతి దీపిక 'రమణీయం'

సాహితీమిత్రులు విజయవాడ, సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్ సంయుక్తంగా ప్రచురించిన 'రమణీయం', 'ఎన్‌విఆర్' సామాజికహితాన్ని ఆకాంక్షించి సహృదయ, స్నేహశీలిగా అభ్యుదయవాదిగా జవహర్‌భారతి, 'విశ్వోదయ' అనుబంధ విద్యాప్రవర్తకునిగా తెలుగునాట ఎందరో మేధావులకు అత్యంత సన్నిహితులైన ఎన్.వి.రమణయ్య, జీవనసాఫల్యతకు అక్షరరూపంలో అద్దంపడ్తోంది. సుమారుగా 46మంది వ్యాసకర్తలు, ఒక ప్రతిభావంతుడైన, సామాజిక సేవాతత్పరుపైన విద్యాధికుని జీవనస్మృతులను వారికివున్న వ్యక్తిగత సాన్నిహిత్య దృక్కోణంలో గుర్తులు, జ్ఞాపకాలుగా, సమాలోచనలుగా, తాత్త్వికతా దృష్టితో తెలియచెప్పడం, అరుదైన సంకలనంగా సంపాదకులు తీర్చిదిద్దడంతో సముచితమైన నివాళిగ్రంథంగా 'రమణీయం' వెలుగు చూసింది. వ్యాపార దృక్పథంతో కాకుండా పి.పి.రావ్, డి.ఆర్.శంకరన్, సదాశివ, బాలమురళి విభిన్నరంగాల సమున్నత జీవన వ్యక్తిత్వాల ఔన్నత్యాన్ని అక్షరీకరింపచేసిన, రమణయ్య హృదయ రమణీయతను ఈ విధంగా గ్రంథస్థం చేయడం అభినందనీయం.

**(రమణీయం, సంపాదకులు: కె.వి.కోటిలింగం, కె.తాతిరెడ్డి, డా॥ డి.వెంకటరావు, వి.చెంచయ్య, విశ్వేశ్వరరావు, ప్రతులకు: వి.చెంచయ్య, 10-40-15ఎ, రామాలయం వీధి, జనతాపేటనార్త్, కావలి, నెల్లూరుజిల్లా)** **- యర్రమిల్లి**

# కడపలో వెలసిన ఆలయాలు

సహజంగా క్షేత్ర దర్శనం, తీర్థయాత్రలు అనగానే అందరిదృష్టి తమిళనాడు, ఉత్తరప్రదేశ్ లేదా కేరళ లేక కర్ణాటకవైపు చూస్తుంటారు. ముఖ్యంగా మన రాష్ట్రం నుండి అనేకమంది యాత్రీకులు వివిధ రాష్ట్రాలకు తరచు వెళుతుంటారు. కానీ కొంత ఆసక్తి మరికొంత అన్వేషణ ఇంకొంత ఆధ్యాత్మిక దృష్టి ఉంటే మన రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అనేక పురాతన, పౌరాణిక చారిత్రక నేపథ్యం కలిగిన అనేక మహిమాన్విత దేవళాలు కనిపిస్తాయి. నా ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాలను వెళ్లే అవసరం నాకు దైవానుగ్రహంతో అనేక జిల్లాలలోని ప్రసిద్ధ, అపురూప, మరుగున పడి న ఎన్నో దైవసన్నిధులు సందర్శించుకునే అరుదైన అవకాశం లభించింది. ఇంకా ఎన్నో ఉన్నాయి. వాటిని కూడా సందర్శించడానికి ఆ దేవదేవుడు నాకు ఆరోగ్య, శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని పూర్తి శరణాగతితో వేడుకొంటున్నాను. మొదటగా తిరుమల వాసుని చేరుకోడానికి తొలి అడుగుగా పేరొందిన కడప జిల్లాలో ఎన్నో ప్రసిద్ధ ఆలయాలు ఉన్నాయి. ఒంటిమిట్ట, నందలూరు, పుష్పగిరి, గండికోట, రాయచోటి, గండి, సిద్ధవటం, ప్రొద్దుటూరు లాంటి ప్రదేశాలలో పురాతన, చారిత్రక ఆలయాలు నెలకొని ఉన్నాయి. ఇవి కాకుండా స్థానికులకు తప్ప బయటివారికి తెలియని మరెన్నో విశేషపురాతన నిర్మాణాలు ఈ జిల్లాట కనపడతాయి. వాటిలో కొన్ని ఆలయాలను వరసగా పరిచయం చేస్తాను.



## శ్రీరంగనాథస్వామి ఆలయం, పులివెందుల

ఒకప్పుడు ఈ ప్రాంతం దట్టమైన అటవీప్రదేశం. వన్యమృగాలు తిరగాడుతుండేవట. ముఖ్యంగా పెద్దపులులు మందలు మందలుగా సంచరించేవట. అందువలన 'పులి మందల' అనేవారట. కాలగతిలో 'పులివెందుల'గా మారింది అంటారు. నేడు అతివేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచ ప్రసిద్ధికెక్కిన ఈ నగరంలో చాలా చిన్నాపెద్దా ఆలయాలున్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి శ్రీరంగనాథ స్వామి ఆలయం, మిట్టశ్రీమల్లేశ్వరస్వామి ఆలయం. తొలుత శ్రీరంగనాథ స్వామి ఆలయం గురించి తెలుసుకుందాం. కారణం పులివెందుల పురపాలక సంఘం వారి అధికార చిహ్నం ఈ ఆలయ గోపురమే శ్రీరామచంద్రుని వంశంలో జన్మించిన వాడు 'మాంధాతరాజు' పాలకునిగా ప్రజల మన్ననలను పొందినవాడు. తన శౌర్య పరాక్రమాలతో ముల్లోకాలను జయించారని పురాణాలు వెల్లడిస్తున్నాయి. మాంధాత గొప్ప విష్ణుభక్తుడు. దేశపర్యటనలో 'పాపాఘ్నినది' సమీపంలో విడిది చేశారట. అక్కడి ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడై ఇక్కడ తన ఇష్టదైవమైన శ్రీవైకుంఠనాథునికి ఒక ఆలయం నిర్మించాలి అనుకున్నారట. స్వయంపర్యవేక్షణలో శ్రీభూనీళాదేవి సమేత శ్రీరంగనాథ స్వామి ఆలయాన్ని నిర్మింపచేశారట.



మహాభారత, భాగవత పురాణాలలో మాంధాత మహారాజ ప్రస్థాపన ఉన్నదని అంటారు. అనగా పులివెందుల శ్రీరంగనాథస్వామి ఆలయం సుమారు త్రేతాయుగం నాటిదిగా భావించవచ్చును. అనేకవేల సంవత్సరాల కాలంలో నేటి రూపుసంతరించుకొన్నది అని శాసనాలు తెలుపుతున్నాయి. విజయనగర సామ్రాజ్యం పతనం చెందిన తర్వాత ఈ ప్రాంతాన్ని అనేకమంది రాజులు పాలించారు. అధికారం కోసం అనేక యుద్ధాలు జరిగాయి. వాటిల్లో ఈ ఆలయం కూడా దాడికి గురైనది. మరాఠా రాజులకాలంలో మరోసారి ఈ ఆలయం వెలుగులోనికి వచ్చింది. పీష్వా బాలాజీ బాజీరావు ఆలయ నిర్మాణానికి, మూలవిరాట్టు ప్రతిష్ఠాపనకు కావలసిన విధులను కైంకర్యంగా సమర్పించుకొన్నారని శాసనాలు తెలుపుతున్నాయి. అనంతరకాలంలో కూడా శ్రీరంగనాథస్వామి ఆలయం దాడులకు లోనైనట్లుగా తెలుస్తోంది.

ఆలయ విశేషాలు

సువిశాల ప్రాంగణంలో నలుదిక్కులా చక్కని శిల్పాలతో కూడిన ప్రవేశగోపురాలతో శోభాయమానంగా స్వాగతిస్తుంది పులివెందుల పట్టణానికి మూడుకిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరంగనాథస్వామి ఆలయం. మండపాలకు అంమైన శిల్పాలు చెక్కబడి కనబడతాయి.

అవన్నీ కూడా విజయనగర శైలిలో ఉండటం చెప్పుకోవలసిన అంశం. గర్భాలయంలో శేషశయనునిగా శ్రీరంగనాథస్వామి శయన భంగిమలో రమణీయ అలంకరణలో నేత్రపర్వంగా దర్శనం ప్రసాదిస్తారు. దేవేరులుగా శ్రీభూదేవి, శ్రీనీళాదేవి గర్భాలయానికి ఇరుపక్కలా ప్రత్యేక సన్నిధులలో కొలువై ఉంటారు.

ఉపాలయాల్లో వాయునందనుడు శ్రీ ఆంజనేయుడు, వినతా తనయుడు శ్రీగరుత్మంతుడు ఉంటారు. పురాతన కాలం నుండి సంప్రదాయంగా వస్తున్న నాగ ప్రతిష్ఠలు ఇక్కడ కూడా కనబడతాయి. ప్రతినిత్యం నియమంగా నాలుగు పూజలు జరిగే శ్రీరంగనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి, ధనుర్మాస పూజలు, శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, ఇతర వైష్ణవ, స్థానిక పర్వదినాలైన ఉగాది, సంక్రాంతి సమయాలలో విశేష పూజలు నిర్వహిస్తారు.

ప్రతి సంవత్సరం ఘనంగా జరిగే శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో మనరాష్ట్రం నుండే కాక పక్కరాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

## శ్రీవృషభాచలేశ్వరస్వామి ఆలయం, వేంపల్లె

పులివెందులకు సమీపంలోని మరో పౌరాణిక ప్రాశస్త్యం గల క్షేత్రం శ్రీమన్నారాయణుడు కలియుగ దైవంగా ఇలలో కొలువు తీరిన మరో విశేష ఆలయం.

లోకకంటకులైన అసురులు వరగర్వంతో లోకాలను అల్లకల్లోలం చేసినప్పుడల్లా జగద్రక్షకుడైన శ్రీహరి వారిని అంతం చేయడానికి ఒక అవతారం ధరించడం మనందరికీ తెలిసిన విషయమే. ఈ క్షేత్రగాథ కూడా జగన్నాథుడు చేసిన రాక్షస సంహారంతో ముడిపడి ఉన్నది కావడం విశేషం.



క్షేత్రగాథ

గతంలో వృషభాసురుడు అనే రాక్షసుడు త్రిమూర్తులలో ఎవరు శీఘ్రంగా కరుణిస్తారు. వరాలను ప్రసాదిస్తారు అని ఆలోచన చేస్తాడట. అతనికి జీవులను సృష్టించి వారి ఆయుర్దాయాన్ని నిర్ధారించే విధాత ఎందరికో సులంగా వారు కోరిన కోర్కెలను అనుగ్రహించినట్లుగా గ్రహించాడట. సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని గురించి తీవ్రమైన తపస్సు చేసాడట. కమలాసనుడు సంతృప్తి చెంది దర్శనం ఇచ్చారట. తనకు మానవుల చేతగాని, దేవతల చేతగాని మరణం లేనివరం కోరాడట వృషభాసురుడు. వరం అనుగ్రహించారు విరించి. తన ఆలోచన ఫలించి కోరిన కోర్కె లభించడంతో ముల్లోకాలను ఆక్రమించుకొన్నాడట. యజ్ఞయాగాదులు చేస్తున్న మహర్షులను వేధించసాగాడట. అలాగని అతను విష్ణు లేక శివ ద్వేషికాదు. తన అధికారాన్ని చూపించాలన్న తలంపుతో గతంలో మిగిలిన రాక్షసులు చేసిన అకృత్యాలనే చేయసాగాడు. మునులు, మహర్షులు వైకుంఠవాసుని అసురబాధ నుండి విముక్తి కలిగించమని ప్రార్థించారట. దీనకర రక్షకుడైన దామోదరుడు రోసుడు దేవతలు, మానవుల నుండి మృత్యువు రాకూడదని కోరుకున్నాడు. కానీ జంతువుల గురించి మరిచిపోయాడు. కనుక తానొక వృషభరూపం ధరించి రాక్షసునితో పోరు చేసాడట. తనకు మరణం



తప్పదన్న విషయాన్ని గ్రహించిన వృషభాసురుడు తన శరీరాన్ని శిలగా మార్చి దాని మీద స్వామిని కొలువు తీరమని కోరాడట. అలా శ్రీమహావిష్ణువు ఇక్కడ అర్చారూపంలో స్థిరపడ్డారు.

## పాపాఘ్ననది

కర్ణాటకలోని చిక్బల్లార్పూర జిల్లాలోని నంది కొండల్లో ఉద్భవించినది పాపాఘ్నినది. పేరు తెలుపుతున్నట్లుగా సకల పాపాలను హరించేదిగా పాపాఘ్నినది ప్రసిద్ధి. పెన్నానది ఉపనది. కర్ణాటకలో కొంతదూరం, ఆంధ్రప్రదేశ్‌లో కొంత దూరం ప్రయాణించి చివరకి కడప జిల్లాలోని కమలాపురం వద్ద పెన్నా నదితో సంగమిస్తుంది. పాపాఘ్ని నది ఎంత ప్రసిద్ధమో తీరంలో వెలసిన క్షేత్రాలు కూడా అంత మహిమాన్వితమైనవి. ముఖ్యంగా గండి, శ్రీవృషభాచలం. వృషభాచలంలో పైనుండి జాలువారే పాపాఘ్ని జలాలను అందునా వర్షాకాలంలో ఒక మధురానుభూతి.

ఆలయ విశేషాలు

స్థానికంగా 'ఎద్దుల కొండ'గా పిలవబడే వృషభాచలం మీద విశాల ప్రాంగణంలో పురాతన ఆలయస్థానంలో అదేవిధంగా నూతన ఆలయాన్ని నిర్మించారు. గర్భాలయంలో శ్రీవృషభాచలేశ్వరుడు వరద, కటిహస్తాలతో స్థానిక భంగిమలో నయనమనోహరంగా దర్శనం ప్రసాదిస్తారు. ప్రత్యేక సన్నిదిలో శ్రీపద్మావతి అమ్మవారు చతుర్భుజాలతో వరద, అభయ హస్తాలతో ప్రశాంత వదనంతో ఉపస్థిత భంగిమలో కొలువై ఉంటారు. పన్నిద్దరు ఆళ్వార్లు, శ్రీఆంజనేయుడు, శ్రీగరుత్మంతుడు ఉపాలయాలలో కనిపిస్తారు. వైకుంఠ ఏకాదశి, ధనుర్మాస పూజలు విశేషంగా చేస్తారు. అన్ని పర్వదినాలలో భక్తులు పెద్దసంఖ్యలో కోరిన కోర్కెలు తీర్చే శ్రీపద్మావతి సమేత శ్రీవృషభాచలేశ్వరుని దర్శించుకోవడానికి తరలి వస్తుంటారు. వేంపల్లె కడపకు ముప్పైకిలోమీటర్ల దూరంలో ఉన్నది. అక్కడికి క్షేత్రం అయిదు కిలోమీటర్లు. ఆటోలు లభిస్తాయి. నేరుగా కొండపైకి వెళ్లడానికి రహదారి మార్గాన్ని నిర్మించారు. అదేవిధంగా విశేష హనుమత్ క్షేత్రమైన 'గండి' ఇక్కడకు పన్నెండు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నది. వేంపల్లె నుండి వెళ్లవచ్చును.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

కథ

# తెగిన గాలిపటం

**రోహిత్**, మోహిత్ కవల పిల్లలు. పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రతిరోజు సైకిళ్లపై పాఠశాలకు వెళ్లేవారు. అదివారాలు, సెలవు రోజుల్లో అయితే వారు తెగిన గాలిపటాల్లా ఎటుపడితే అటు వెళ్లిపోయేవారు. పిల్లలిద్దరూ క్షేమంగా ఇంటికి చేరేవరకు తల్లిదండ్రులు ఆందోళనగా ఎదురు చూసేవారు. తల్లిదండ్రులు ఎంత చెప్పినా వారి మాటలు పట్టించుకోకుండా తిరిగేవారు. కొన్ని సందర్భాలలో పెద్దలకు చెప్పకుండా ప్రమాదకరమైన చెరువులకు వెళ్లి ఈత కొట్టేవారు. తోటలకు వెళ్లి ఎత్తైన చెట్లు ఎక్కి తోటమాలి అనుమతి లేకుండా కాయలు కోసి తినేవారు. పిల్లలు వక్ర మార్గంతో నడుస్తున్న విషయాన్ని తండ్రి విశాల్ గమనించి వారిలో మార్పు తేవాలని భావించాడు. ఒకరోజు రోహిత్, మోహిత్‌ను తండ్రి విశాల్ పిలిచాడు.



'బాబు! రోజులు బాగాలేవు. మీరు పాఠశాల నుండి ఇంటికి వచ్చి సమీపాన ఉన్న క్రీడామైదానంలో ఆటలు ఆడుకుని, ఆ తరువాత స్నానం చేసి చదువుకుని, భోజనం చేసి నిద్రపోవడం అలవాటు చేసుకోండి. ఎటుపడితే అటు మీ ఇష్టానుసారంగా తిరగడం మంచి పద్ధతి కాదు. మీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే జీవితం తెగిన గాలిపటంలా మారిపోయి లక్ష్యం, గమ్యం, దశ, దిశ లేకుండా పోతోంది' అని హితవు పలికాడు తండ్రి విశాల్.

ఆ మాటలకు కవల పిల్లలిద్దరూ లెక్కచేయలేదు. 'నాన్న! మేమేమన్నా చిన్న పిల్లలమా? సరదాగా తిరిగి వస్తాము' అని వితండవాదం చేశారు. ఒకరోజు రోహిత్, మోహిత్ ఇంటికి సమీపాన ఉన్న పెద్ద నది వద్ద ఆడుకుంటున్నారు. అంతలో అక్కడికి ఒక మరపడవ వచ్చింది. ఇద్దరూ అందులో ఎక్కి ఆడుకోసాగారు. అనుకోకుండా పడవ కదిలింది. దాంతో రోహిత్, మోహిత్ ఆందోళన చెందారు. పడవవాడు నేరుగా నది మధ్యకు తీసుకుని వెళ్లి పడవను నిలిపివేసి చేపలు పట్టుకోసాగాడు.

'అంకుల్! మేం ఒడ్డుకు వెళ్లాలి. తీసుకుని వెళ్లండి' అని పిల్లలు ప్రాధేయపడ్డారు. 'మీరు ఎవరి అనుమతితో పడవ ఎక్కారు. నా పడవ, నా ఇష్టం. సాయంత్రం వరకు చేపలు పట్టుకుని ఆ తరువాతే నేను ఒడ్డుకు చేరతాను' అని గదమాయించాడు పడవవాడు. పిల్లలిద్దరూ ఏడ్చి, ఏడ్చి పడవలోనే నిద్రపోయారు. కళ్లు తెరచి చూడగానే వాళ్ల తల్లిదండ్రులిద్దరూ ఎదురుగా ఉన్నారు. పిల్లలు వారిని చూసి ఆనందంగా కౌగించుకుని బోరున ఏడ్చారు.

ఆ సంఘటనతో పిల్లల్లో పెనుమార్పు వచ్చింది. 'ఇకపై మీ అనుమతి లేకుండా మా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించము' అని పిల్లలిద్దరూ తల్లిదండ్రులకు మాట ఇచ్చారు.

పిల్లల్లో మార్పు తేవడానికి ఇదంతా పడవవాడితో కలిసి తండ్రి విశాల్ ఆడిన నాటకం అని ఎవరికీ తెలియదు. ఆరోజు నుండి తల్లిదండ్రుల అనుమతి లేకుండా తెగిన గాలిపటంలా ఎటుపడితే అటు వెళ్లకుండా బుద్ధిగా నడచుకుంటూ, పెద్దల మాటవింటూ, వారి నుండి జీవిత పాఠాలను నేర్చుకుని ప్రయోజకులయ్యారు.

**- షేక్ అబ్దుల్ హాకీం జాని**


## బాలగేయం

### చిట్టి ఉడుత



చిట్టి ఉడుత చూడరా
చిన్ని ఉడుత చూడరా
గబగబా చకచకా
గెంతుతోంది చూడరా
దాని వీపు చూడరా
మూడు చారలుండురా
రాముని కృప పొందెనని
కథ ఉన్నది చూడరా
కుచ్చు తోక చూడగా
అలరించును చూడరా
కీచుకీచుమని అరవగ
ఉల్లాసం కలుగురా
గింజలను పండ్లను
వెతుకుతోంది చూడరా
బుడతలారా ఉడుత లాగ
ఉరుకెత్తగా రండిరా

**- అళహరి కాత్యాయని**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- ఆశాజ్యోతి,** వేములవాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కారం తింటే ముక్కులోంచి నీరు ఎందుకు కారుతుంది?



**జవాబు: ఆశాజ్యోతి!** కారం ఎక్కువైనప్పుడు నాలుక మండటం సహజం. కానీ నాలుక మీద మంటతో పాటు ముక్కు వెంట నీరు కారుతుంది. రుచి చూసే నాలుకకు ఇబ్బంది కలిగితే ముక్కులో ప్రతిచర్య రావటం ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ దీనికి కారణం కారం లేదా ఇతర మసాలా దినుసుల్లో వుండే కాప్సైసిన్ అనే రసాయనం. ఈ రసాయన ప్రభావం కేంద్ర నాడీవ్యవస్థ మీద ఉంటుంది. ముక్కులో శ్లేష్మాన్ని జీర్ణ వ్యవస్థలో రసాలను ప్రభావితం చేసే నాడీ కేంద్రం మీద కాప్సైసిన్ ప్రభావం ఉంటుంది. ముక్కు నుండి ఎటువంటి శ్లేష్మం, ఎంత దట్టంగా కారాలనే నిర్ణయం మెదడులోని ఆ కేంద్రంలో ఉంటుంది. మసాలా లేదా కారం ప్రభావం ఆ కేంద్రం మీద కలగగానే అది శ్లేష్మాన్ని అధికంగా స్రవిస్తుంది. అదే నీటి రూపంలో కారుతుంది. ఈ రసాయనం మిరియాలలోనూ ఉంటుంది. అందుకే జలుబు బాగా తీవ్రంగా చేసి ముక్కు బిగేసినప్పుడు మిరియాల కషాయం తాగమంటారు. అది తాగగానే ముక్కు వెంట చీమిడి కారి బయటకు వస్తుంది.



దానితో పాటే జలుబుకారక సూక్ష్మజీవులు బయటకు వెళ్లి ఉపశమనం కలుగుతుంది. కారం అధికంగా తిన్నప్పుడు నీళ్లు తాగటం వల్ల మంట తగ్గదు. ఈ రసాయనం నీళ్లలో కరగదు. నెయ్యి, వెన్న లేదా పెరుగు వంటి తింటే కారం తగ్గిపోతుంది.





# పరిశోధన చిన్నదే, దక్కింది నోబెల్ ప్రైజ్



**రాళ్లను రుచి చూడటమెందుకు?**

చాలామంది శాస్త్రవేత్తలు రాళ్లను నాలుకతో ఎందుకు రుచి చూస్తారు? ఇదేం ప్రశ్న అని మనసులోనే నవ్వుకుంటున్నారు కదా. దీన్ని గుర్తించటానికి చేసిన పరిశోధనకే ఈసారి రసాయన, భూగర్భ శాస్త్ర ఐజీ నోబెల్ దక్కింది. బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్‌కు చెందిన జాన్ జలసీవిక్జ్ దీన్ని అందుకున్నారు. 'నాలుకతో అద్దినప్పుడు ఉపరితలం తడిగా అవుతుంది. దీంతో శిలాజం, ఖనిజాల ఆకృతులు నిక్కబొడుచుకొంటాయి. అదే పొడి ఉపరితలాల మీదైతే సూక్ష్మ ప్రతిబింబాలు. వికిరణాల మూలంగా అవి మసకబారతాయి' అని ఆయన తన ఈటింగ్ ఫాజిల్స్ అనే పరిశోధన వ్యాసంలో వివరించారు.

**చాలాచాలాసార్లు**

ఒకే పదాన్ని చాలా చాలా చాలా సార్లు వల్లె వేసినప్పుడు ఏం జరుగుతుంది? మనిషికి ఎలాంటి అనుభూతులు కలుగుతాయి? దీనిపై అధ్యయనం చేసినందుకే ఫ్రాన్స్, బ్రిటన్, మలేషియా, ఫిన్‌ల్యాండ్ పరిశోధక పత్రం మెమరీ పత్రికల్లో ప్రచురితమైంది.

**సాలీడు పట్టు**

సాలీడు చనిపోతే ఏం చేస్తాం? బయట పారేస్తాం. కానీ రైస్ యూనివర్సిటీకి చెందిన ఫాయే యాప్, డేనియల్ ప్రెస్టన్ బృందం విచిత్రంగా ఆలోచించింది. మెకానికల్ గ్రిప్పింగ్ పరికరాలుగా వాడుకోవటానికి చనిపోయిన సాలీళ్లను తిరిగి నడిపించింది. ఈ వినూత్న పరిజ్ఞానానికి నెక్రోబాటిక్స్ అనీ నామకరణం చేశారు. అంటే జైవిక అంశాలను రోబో

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,**
**లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**
sunmagvaartha@gmail.com

భాగాలుగా ఉపయోగించటానికి తోడ్పడే శాస్త్రమన్నమాట.

### ఓ టాయ్‌లెట్‌కూ

స్టాన్‌ఫోర్డ్ టాయ్‌లెట్‌ను ఆవిష్కరించినందుకు సీయాంగ్-మిన్ పార్క్ ప్రజారోగ్యంలో ఐజీ నోబెల్ అందుకున్నారు. ఈ టాయ్‌లెట్ గొప్పతనమేంటో తెలుసా? వివిధ పరిజ్ఞానాల సాయంతో విసర్జన సమయంలోనే మలాన్ని త్వరగా విశ్లేషించి, అందులో ఏమున్నాయో వివరించటం.

### తిరగేసి మాట్లాడినా..

పదాలను తిరగేసి మాట్లాడే నైపుణ్యం గలవారిలో మెదడు తీరుతెన్నుల మీద అధ్యయనం చేసిన వారికి కమ్యూనికేషన్‌లో బహుమతి దక్కింది. స్పెయిన్‌లోని లా లగునాలో ఒక జాతికి చెందినవారు మామూలుగానే కాకుండా, వెనక్కి మాట్లాడటమూ నేర్చుకుంటారు. వీరిని దృష్టిలో పెట్టుకునే ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.

### ముక్కులో వెంట్రుకలు

ముక్కులో ఎన్ని వెంట్రుకలుంటాయి? రెండు రంధ్రాల్లోనూ సమానంగా ఉంటాయా? పరిశీలిస్తే పోలా, ఇదేం



పిచ్చి పని అనుకుంటున్నారా? నిజంగా దీన్ని గుర్తించటానికే కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన నటాషా మెసింకోవస్క, ఆమె బృందం ప్రయత్నించింది. జీవన్మృతుల మీదే అధ్యయనం నిర్వహించింది. వీరికే మెడిసిన్ ఐజీ నోబెల్ దక్కింది మరి. జీవన్మృతుల ముక్కుల్లో ఒకో రంధ్రంలో సగటున 120 వెంట్రుకలు ఉంటున్నట్టూ వీళ్ల గుర్తించారు.

### విద్యుత్ ఉప్పు

విద్యుదీకరించిన చాప్‌స్టిక్స్, ఆహారం రుచిని ఎలా మారుస్తాయో తెలియజేసే పరిశోధనకు న్యూట్రిషన్ విభాగంలో బహుమతి వచ్చింది. జపాన్‌లోని మీజి యూనివర్సిటీకి చెందిన హోమీ మియషిత, హోరోమీ నకముర దీన్ని అందుకున్నారు. విద్యుత్తుతో ఆహారం మరింత ఉప్పగా అనిపించేలా చేసే మార్గాలను వీరు కనుగొన్నారు. ఉప్పు ఎక్కువగా తినేవారికిది నిజంగా గొప్ప వరమే. ఉప్పు తక్కువగా ఉన్నా ఎక్కువగా అనిపిస్తే ఆరోగ్యానికి మేలే కదా.

### బోర్ కొట్టించినా

ఉపాధ్యాయుల్లో, విద్యార్థుల్లో విసుగు మీద పద్ధతి ప్రకారం చేసిన అధ్యయనం విద్య విభాగం బహుమతిని దక్కించుకుంది.

### దారినపోతూ ఆకాశంలోకి

దారిలో కొందరు ఆకాశంలోకి చూస్తున్నారనుకోండి. అటుగా వెళ్తున్న కొందరు వారిని చూసి ఆగి, పైన ఏముందోనని వాళ్లూ పైకి చూశారనుకోండి. ఇలాంటివారు మనచుట్టూ ఎంతమంది ఉంటారు? మాకేం పనీపాటా లేదా? ఇదేం ప్రశ్నని విసుక్కోకండి. న్యూయార్క్ పట్టణ వీధుల్లో ఈ విచిత్ర అధ్యయనం చేసినందుకే లియోనార్డ్ బిక్‌మ్యాన్ అనే ఆయనకు సైకాలజీలో బహుమతి వచ్చింది. ❑

## మహిళకు పట్టం

(10వ పేజీ తరువాయి)

భారతదేశంలో ఎంతో మంది మహిళలు రాజకీయాల్లో రాణించారు, రాణిస్తున్నారు. చట్ట సభల్లో తమదైన శైలితో ముందుకు దూసుకుపోతున్నారు. సోనియాగాంధీ రెండు పర్యాయాలు కాంగ్రెస్‌ను గెలిపించి, జాతీయ రాజకీయాలను పరోక్షంగా ఒంటిచేత్తో శాసించి, శక్తివంతమైన నాయకురాలిగా పేరు గడించారు. మమతా బెనర్జీ, దివంగత సుష్మాస్వరాజ్, నిర్మలా సీతారామన్, వసుంధరా రాజె, స్మృతి ఇరానీ ప్రభృతులు రాజకీయాల్లో విశేషంగా రాణించారు. వయసు పైబడినా వీరిలో కొంత మంది ఇంకా క్రియాశీల రాజకీయాల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. దివంగత ప్రతిభా పాటిల్ భారతదేశ తొలి మహిళా రాష్ట్రపతిగా పని చేసారు. ద్రౌపది ముర్ము ప్రస్తుత రాష్ట్రపతిగా తన బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. గతంలో జయలలిత, ఉమాభారతి, మాయావతి వంటివారు రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. ఇలా ఒకరేమిటి.. అనేక మంది కేంద్రంలోను, రాష్ట్రాల్లోను రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించి మహిళలు రాజకీయాల్లో విశేషంగా రాణించగలరని నిరూపించారు. అయితే కుటుంబ



నేపథ్యం, ఆర్థిక, అంగబలం లేని మహిళలు నేటికీ రాజకీయాల్లో నిలదొక్కుకోలేకపోతున్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఇలా ఎన్నికైన మహిళలు సైతం తమ భర్తల, ఇతర కుటుంబ సభ్యుల ఆధిపత్యంలో కొనసాగడం వలన మహిళల రాజకీయ మనుగడ ప్రశ్నార్థకమౌతున్నది. స్త్రీల రాజకీయ ఎదుగుదలకు పురుషులు అడ్డంకి కావడం శోచనీయం. ఇలాంటి పరిస్థితులు మారాలి. స్త్రీలను ముందు కూర్చోబెట్టి, పురుషులు వారి రాజకీయ అధికారాలను హరించడం హర్షించదగ్గ విషయం కాదు. బ్యాక్ సీట్ డ్రైవింగ్ రాజకీయాలకు స్వస్తి చెప్పాలి. మహిళలు రాజకీయాల్లో మగవారి అండ లేకుండా స్వయంగా ఎదగాలి. అప్పుడే స్త్రీలకు నిజమైన రాజకీయ స్వాతంత్ర్యం, రాజ్యాధికారం, గుర్తింపు లభిస్తాయి. చట్ట సభల్లో మహిళలకు పెరగనున్న ప్రాతినిధ్యం, ప్రాధాన్యత దశాబ్దాల స్వప్నం. ఈ స్వప్నం నెరవేరింది. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని, భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, దేశాన్ని ప్రపంచ పటంలో అగ్ర స్థానంలో నిలబెట్టడానికి మహిళలు తమ వంతు ప్రయత్నం చేయాలి. ❑

# నాన్న.. వెనకబడ్డాడు

సింగంపల్లి శేష సాయికుమార్

కథ

"నీ కొడుకు ఈ మధ్య చాలా బిజీగా బయట తిరుగుతున్నట్టున్నాడు. ఏంటి సంగతి? వాడెలాగు నన్ను చూస్తే భయం అన్న సాకుతో ఏం చెప్పడు. అప్పుడప్పుడు నువ్వన్నా కనుక్కో, వాడు ఏం చేస్తున్నాడో" అంటూ భార్య ఇచ్చిన క్యారియర్ తీసుకొని బయలుదేరాడు రామ్మోహన్ రావు.

ఆయన ఇలా వెళ్లాడో లేదో అలా ఇంటికి వచ్చాడు సుధాకర్.

వచ్చీ రాగానే కాళ్లు, చేతులు కడుక్కొని డైనింగ్ టేబుల్‌పై చేరిపోయాడు "అమ్మా, టిఫిన్ పెట్టు, త్వరగా వెళ్లాలి, చాలా పనులు ఉన్నాయి" అంటూ చెప్పే తీరు చూసి ఆనందం పట్టలేకపోయింది రాణెమ్మ.

"అంత పని ఏముందిరా? ఉద్యోగం చెయ్యరా" అంటే 'నాకెరిస్తారు?' అంటావు. ఇక ఏం పని చేస్తున్నావు? మీ నాన్నగారు కూడా ఇప్పుడే అడిగాడు" అంటూ అటుకుల ఉప్మా ప్లేట్లో పెట్టింది.

"అమ్మా, మీరనుకున్నట్టు నా చదువుకు, నాకున్న తెలివితేటలకు ఎవరూ ఉద్యోగం ఇవ్వరు. ఎక్కడికి పోయినా పర్సంటేజ్ ఎంత? అని అడుగుతారు. నాకా అది లేదు. ఇక ఎందుకు చెప్పు?" అంటూ రెండు ముద్దలు తిన్నాడు.

"అయితే ఏం చేస్తున్నావురా? బయట జాగ్రత్త. అసలే కాలం బాగాలేదు. ఏదైనా చేసే ముందు చెప్పి చెయ్యి. లేదంటే ఇబ్బందులు ఎదుర్కోవలసివస్తే కష్టం. మనకెవరూ లేరు కూడా" అంటూ చేయి తలపై వేసి మెల్లగా నిమిరింది.

"అమ్మా, నేనేం చిన్న పిల్లాణ్ణి కాదు. మీరనుకున్నట్టు నేనేం చేయలేదు. ఏది చేసినా మీ పేరు నిలబెట్టడానికే చేస్తా. నాకు మాత్రం చెడిపోవాలని ఉంటుందా చెప్పు?" అంటుండగానే బయట నుంచి "ఒరేయ్ సుధాకర్! రా.. రా.." అంటూ పిలిచాడు బైక్‌పై నున్న ఫ్రెండ్ రవి.

"ఆ.. వస్తున్నా.." అంటూ గబ గబా బైక్ ఎక్కి ఆదరా బాదరా పరుగు పరుగున వెళ్లాడు సుధాకర్.

.............

మనసులో ఏదో చెప్పరాని భయం పట్టుకుంది రామ్మోహన రావుకి. ఎందుకో చిన్నతనం నుండి సుధాకర్ అంతే. అమ్మతోనే చనువు ఎక్కువ. ఏం కావాలన్నా అమ్మనే అడిగేవాడు. నాన్నకు, అతనికి ఆమే వారధి.

నాన్నంటే ఎందుకో చెప్పరాని భయం ఏర్పరుచుకున్నాడు. ఎప్పుడూ చిన్నతనం నుండి ఆయనతో మనసు విప్పి మాట్లాడలేదు. అలాగని ఆయన ఎప్పుడూ తన కొడుక్కి ఏ లోటూ రానీయలేదు. మంచి బట్టలు, తిండి, చదువు ఏమీ ఎక్కడా కొదవ రానీయలేదు. మాట్లాడితే మాట్లాడేవాడు కానీ ఎక్కువ చనువు ఇవ్వలేదు.

కొడుక్కి చదువు సరిగ్గా అబ్బడం లేదని మందలించి, వాడిని ఏ దారిలో పెట్టాలో ఆలోచిస్తాడే తప్ప ఎప్పుడూ తిట్టడంగానీ, కొట్టడంగానీ చేయలేదు. ఇక రాణెమ్మ సుధాకర్‌కు ఏం కావాలో కనుక్కుని మరీ సమకూరుస్తుంది.

స్నేహితుల మాటలు ఎంతవరకు వినాలో, ఎవరెవరితో స్నేహం చేయాలో, ఎలా మసలుకోవాలో చెబుతూనే ఉంటుంది. నువ్వు బాగా సంపాదిస్తే నేను, మీ నాన్న తీర్థయాత్రలకు వెళ్తాంరా" అంటూ కొడుకును పురుష లక్షణం వైపు సాగనంపే ప్రయత్నం చేసేది.

చదువు సరిగ్గా అబ్బలేదు సుధాకర్‌కు, అత్తెసరు మార్కులతో డిగ్రీ కాస్తా పూర్తి చేశాడు. ఇంకెన్నాళ్లు ఇలా ఉండాలి? అంటూ ఏవేవో ఆలోచనలు మనసులో మెదులుతున్నాయి. ఒకరి వద్ద ఉద్యోగం చేసి సంపాదించే తెలివితేటలు తన వద్ద లేవని ఎందుకో మానసికంగా సిద్ధమైపోయాడు. ఇక ఏం చేస్తే బాగుంటుందని ఇద్దరు, ముగ్గురు స్నేహితుల దగ్గర సలహా తీసుకున్నాడు. ఒకడు హోటల్ పెట్టమన్నాడు. ఇంకొకడు ఇంత చదువు చదివి ఎంగిలి ప్లేట్లు కడుగుతావా? కూర్చుని చేసే వ్యాపారం చేయమన్నాడు. ఇంటర్నెట్ వ్యాపారం పెట్టమన్నాడు మరొకడు. అదైతే నాలుగు సిస్టమ్స్ పెట్టుకొని ఏ.సి.రూములో కూర్చుని చేసే వ్యాపారం. గంట గంటకు డబ్బులు, ప్రింట్లు, అప్లికేషన్లు, ఒకటేమిటి? అన్నింటికీ డబ్బులే.. అంటూ వారు చెప్పే మాటలకు సుధాకర్‌కు జేబులో కనకవర్షం కురిసినట్లయింది.

"రేయ్! ఎంత కావాలిరా పెట్టాలంటే" అన్నాడు టక్కుమని.

"కనీసం ఓ ఐదు లక్షలన్నా ఉండాలి. రెండు, సిస్టమ్‌లు, నెట్టు, ఎ.సి.లు.. ఇలా కావాలి మరి" అంటూ అంచనాలు చెప్పాడు మరో పెద్దమనిషి.

"నీకు ఇంట్రెస్ట్ అయితే ప్రయత్నం చెయ్యరా. ఇంతకీ పెట్టుబడికి సరిపడా డబ్బు ఉందా?" అన్నాడు రవి.

"మన దగ్గర అంత డబ్బు ఉంటే ఈ తిప్పలు ఎందుకురా, ఓ పది వేల వరకు ఐతే ఎలాంటి ఇబ్బంది లేదు. లక్షలు అంటే కష్టం. వద్దులే బాబు" అంటూ లేవబోయాడు.



"నీకు నిజంగా వ్యాపారం చేయాలన్న పట్టుదల, అభిరుచి ఉంటే చెప్పు. మా మాటలతో వద్దు, వడ్డీకి ఇచ్చే ఓ వ్యక్తి నాకు తెలిసినతను ఉన్నాడు. ఆయన దగ్గరకు వెళ్లి నీకెంత కావాలో తీసుకో. కానీ నెల నెలా వడ్డీ చాలా ఎక్కువగా కట్టాల్సి ఉంటుంది. బాగా ఆలోచించు" అన్నాడు రవి.

"అంత డబ్బులు ఇంట్లో తెలియకుండా తీసుకుని, ఒకవేళ కట్టలేకపోతే పరిస్థితి ఏమిటిరా?" అంటూ రవి వైపు చూసాడు సుధాకర్.

"వ్యాపారం అంటేనే రిస్క్. రిస్క్ చేయకపోతే ఇప్పుడు నీకు వేరే మార్గం లేదు. లేకపోతే ఇలానే ఉండాలి కదా! ఆలోచించు" అంటూ ధైర్యం చెప్పే ప్రయత్నం చేసాడు రవి.

"సరే.. పదరా ఇక ప్రయత్నాలు మొదలు పెట్టేస్తా" అంటూ రెట్టించిన ఉత్సాహంతో పనులు ప్రారంభించాడు. ఎంతో హుషారుగా పనులు చేసుకుంటున్నాడు. కనీసం అమ్మకైనా చెబుతాం అనుకున్నాడు. కానీ ఇప్పుడే వద్దు మొదట నిలదొక్కుకున్నాక చెబితే వాళ్ల ఆనందం చూడొచ్చనుకున్నాడు.

అనుకున్నట్టుగానే డబ్బు సమకూర్చుకొని వ్యాపారం మొదలుపెట్టాడు. ఒక్కొక్కరు రావడం మొదలుపెట్టారు. ఒకవైపు స్టూడెంట్స్ గేమ్స్ కోసం, పెద్దలు నెట్ కోసం.. మొదటి వారం అనుకున్న దానికన్నా బాగా జరిగింది వ్యాపారం.

ఉదయం లేవగానే న్యూస్ పేపర్‌లో కొత్త మొబైల్ సంస్థ ఉచిత సిమ్‌తో పాటు సంవత్సరం పాటు డేటా ఫ్రీ అని వాణిజ్య విస్తరణ ప్రారంభం కోసం ప్రకటన ఇచ్చింది చూసాడు. మనసులో మొదలైంది గుబురు. చూద్దాం ఒక నెల.. అనుకున్నాడు. ఈలోపు ఆ కంపెని ఒక ప్రభంజనంలా దూసుకు వచ్చింది జలాలలోకి. ఎక్కడ చూసినా, ఎవరిని కదిపినా చేతిలో సెల్‌ఫోన్, చెవిలో ఇయర్ ఫోన్స్, నెట్టు.. ఇలా అంచనాలు తలకిందులైనాయి నెట్ సెంటర్ వ్యాపారులకు.

ఇక అర్థం అయిపోతోంది సుధాకర్‌కు. సంపాదన మొదటి వారం కన్నా క్రమంగా తగ్గిపోయింది. ఒకవైపు అప్పుకు వడ్డీ వచ్చి చేరింది. ఎందుకో మొండి ధైర్యంతో ఇంకో రెండు మాసాలు లాగించాడు. అయినా లాభం లేకపోయింది. ఇక వడ్డీ కట్టమని అడుగుతున్నాడు డబ్బు వచ్చిన వ్యక్తి.

చేతిలో అంత డబ్బు లేదు, స్నేహితులకు ఫోన్‌లు చేసాడు.

అందరిదీ ఒకటే మాట "మాట సాయం చేయమంటే చేయగలం కానీ డబ్బు మా దగ్గర ఎక్కడిదిరా?" అంటూ సమాధానం.

ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని సిస్టమ్స్ ఏ.సి. అమ్మకానికి పెట్టేసాడు. పాతిక భాగం కూడా రాలేదు మొత్తానికి. వచ్చింది కట్టేసి మిగతా డబ్బులు త్వరలో తీరుస్తానని చెప్పాడు సుధాకర్.

ఓపిక పడతానన్నాడు డబ్బు ఇచ్చినాయన.

సమయం గడుస్తోంది.. ఆలోచనలు పెరిగిపోతున్నాయి. ఒకవైపు అప్పు, మరోకవైపు ఇంట్లో ఈ విషయం చెప్పలేని పరిస్థితి. రెండూ గుండెలోతుల్లో నుంచి మెదడు పొరల్లోకి ఎగబాకుతున్నాయి.

కొడుకు వాలకం చూసి ఏదో జరిగింది అన్న అనుమానం కలిగింది రామ్మోహనరావుకి.

"ఏమే! వాన్ని కాస్త గమనిస్తూ ఉండు, ముభావంగా ఉన్నాడు" అంటూ భార్యకు రహస్య ఆదేశాలు జారీ చేసాడు.

ఒత్తిడి ఎక్కువైపోతోంది సుధాకర్‌కు. అమ్మకు చెప్పి అలా బయటకు వెళ్లాడు. ఊరుకి కాస్త దూరంగా ఉన్న నిర్జన ప్రదేశంలోని రైల్వే ట్రాక్ పైకి వెళ్లి కూర్చున్నాడు. ఏదో దీర్ఘంగా ఆలోచనలో పడ్డాడు. మనసులో రాకూడని ఆలోచన వస్తోంది.. జీవితం ఇక చాలనిపించింది.

ఒక పక్క అమ్మ, నాన్న గుర్తొస్తున్నారు. ఈరోజు ఇంటికెళ్లి ఒకసారి వాళ్లను చూసి ఆపై నిర్ణయం తీసుకుందామనుకున్నాడు. ఇంటికెళ్లి భోజనం చేసాడు. మంచంపై చేరాడు "అయినా నేనేం తప్పు చేసాను? ఇంట్లో చెప్పకుండా అభివృద్ధి చెందాలి అనుకోవడం తప్పా! అయినా నాకు అంత స్వేచ్ఛ ఇక్కడ ఉందా?" అంటూ పిచ్చి పిచ్చి మాటలు మనసుగోడల్లో గొడవ చేస్తున్నాయి.

**"నువ్వు పని చేయాలనుకోవడంలో తప్పు లేదు. కానీ ఒక్క మాట మాతో చెబితే మంచి, చెడులు చెబుతాం కదా. ఇక నీ మనసులో ఎలాంటి ఆలోచనలు పెట్టుకోవద్దు" అంటూ ఏమీ జరగని వానిలా వెళ్లిపోయాడు.**

ఇంతలో ఫోన్ రింగ్ అయింది. డబ్బిచ్చిన వ్యక్తి లిఫ్ట్ చేయగానే "హాలో బాబూ, ఇప్పుడే ఎవరో ఒక పెద్దాయన్ను మీ ఫ్రెండ్ పిలుచుకొని వచ్చాడు. నువ్వు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేసి వెళ్లాడు. ఎప్పుడైనా అవసరం ఉంటే ఫోన్ చెయ్యి. ఉంటా...!" అంటూ ఫోన్ పెట్టేసాడు.

ఎవరా పెద్దాయన? అంటూ రవికి ఫోన్ చేసాడు.

"మీ నాన్నా నా దగ్గరకు వచ్చి 'నువ్వు ఎందుకో ఇంట్లో సరిగ్గా ఉండటం లేదని, కారణం చెప్పమని' బలవంతం చేసి, ఆయన దగ్గరకు పిలుచుకొని వెళ్లాడు. ఆయన చెప్పిందంతా ఎక్కడినుంచో తెచ్చి కట్టేశారు. ఈ తతంగం అంతా వారం నుండి జరుగుతోంది. నీకు ఇప్పుడే చెప్పొద్దన్నారు" అంటూ ఉండిపోయారు.

ఫోన్ కట్ చేస్తే ఎదురుగా నాన్న.. "ఏరా, రవి ఏమైనా చెప్పాడా?" అంటూ మెల్లగా అడిగాడు.

"చెప్పాడన్నట్లు" తల ఊపాడు సుధాకర్.

"నువ్వు పని చేయాలనుకోవడంలో తప్పు లేదు. కానీ ఒక్క మాట మాతో చెబితే మంచి, చెడులు చెబుతాం కదా. ఇక నీ మనసులో ఎలాంటి ఆలోచనలు పెట్టుకోవద్దు" అంటూ ఏమీ జరగని వానిలా వెళ్లిపోయాడు.

సుధాకర్ కళ్లల్లో నీళ్లు... "నాన్నా, తప్పుగా మిమ్మల్ని అర్థం చేసుకున్నాను. చిన్నప్పటి నుండి ఇప్పటివరకు ఆయన నాకు తనకు ఉన్నంతలో ఏ లోటూ రానీయలేదు. నేనే ఆయన్ను ఎందుకో అలా చూస్తున్నా. నేను ఎంత తప్పు చేసాను. ఇకపై ఆయన ఏది చెబితే అది చేయాలి. అదే నా భవిష్యత్తుకు మంచిది" అనుకుంటూ పశ్చాత్తాపంతో నిద్ర పట్టలేదు.

ఉదయం కాఫీ తాగుతూ టి.వి. ఆన్ చేయగానే రచయిత తనికెళ్ళ భరణి గారి వాక్యాలు "కానీ... నాన్న ఎందుకో వెనుకబడ్డాడు" అని వచ్చాయి.

నిజమే కదా. అన్నీ ఆయనే చేస్తున్నా ఎందుకో చివరిదాకా ఆయన వెనకాతలే ఉండిపోతున్నారు.. అనుకుని తండ్రిమాట వినడానికి సిద్ధమైపోయాడు.

# ఇట్లు సెల్‌ఫోన్

**ప్రియమైన వినియోగదారులకు,**

**సెల్ ఫోన్ అయినా, మొబైల్ ఫోన్ అయినా గుప్పెట్లో ఇమిడిపోయే ఫోన్ అయినా నేను రాస్తున్న ఈ నాలుగు మాటలు శ్రద్ధగా చదవండి. ఇదేదో భయపెట్టడం అనుకుంటారు... కానే కాదు. జాగ్రత్తగా చదివితే నా మాటలు ఎంత ఉపయోగపడతాయో మీకే తెలుస్తుంది.**

ఈ అబద్ధం కన్నారా... విన్నారా... ఇతరులతో మాట్లాడటానికి నన్ను ఉపయోగించే మీతో నేను తెలియజేయాలనుకున్నది చెప్పకుండా ఉత్తరం రాస్తున్నాను.

కారణం.. మాటల కన్నా రాత గట్టిగా మనసు తెరపై నమోదవుతుంది. ఆధునిక యుగంలో ముఖ్యమైన పరికరాల తయారీలో నాకంటూ ఓ ప్రముఖ స్థానం ఉందన్నది మీ అందరికీ తెలిసిందే. నేను ఓ విధంగా మీకు వరాన్నే.

ఈరోజు మనిషి ఆక్సిజన్ లేకున్నా బతికేస్తాడేమో కానీ నేను లేకుంటే బతకలేని స్థితి అనుకోండి. ఇది మీ అందరికీ తెలిసిందే.

ప్రపంచంలో చైనా తర్వాత నన్ను ఎక్కువగా ఉపయోగించేది భారతదేశమేనట..ట..

చైనాలోనూ, భారతదేశంలోనూ కోట్లాది మంది నన్ను ఉపయోగిస్తున్నారు. నేను లేకుంటే మీకు తోచదు. అది నిజం కదూ. ఒకప్పుడు చైనాలో సెల్‌ఫోన్లు ఉపయోగించినవారి సంఖ్య అరవై అయిదు కోట్లు. ఇక భారతదేశంలో పది కోట్ల మంది నన్ను ఉపయోగించారు. ఇప్పుడీ సంఖ్య మరింత పెరిగే ఉంటుంది కానీ తగ్గదు. మున్ముందు మరింత పెరుగుతుంది. అందులో ఆశ్చర్యమేమీ లేదు.

ఒకానొకప్పుడు వేరే ఊళ్లో ఉన్న ఒకరితో మాట్లాడాలంటే ట్రంక్ కాల్ బుక్ చేయాలి. అవతలి వ్యక్తి లైన్లోకి వచ్చేవరకు నిరీక్షించాలి. ఒకటి రెండు గంటల తర్వాత మాట్లాడండి అని లైనిస్తాడు. తీరా మీరు ఎవరితో మాట్లాడాలనుకున్నారో ఆ మనిషి లేడండి అని సమాధానం వస్తే ఎంతలా నీరసించిపోతామో.

ఉత్తరాలు, ప్రత్యుత్తరాలు మనుషులను పాలించిన రోజులవి.. ఓ మనిషి తన భావాలను, మనసులోని ఆలోచనలను తాననుకున్న వ్యక్తితో పంచుకోవడానికి ఉత్తరాలను ఓ వారధిగా చేసుకునేవాడు. ఉత్తరం అందుకోగానే అవతలి వ్యక్తికి ఎంత ఆనందమో... అలాగే ఆ వ్యక్తి ఆలస్యం చేయకుండా ఉత్తరం రాస్తే ఇవతలి వ్యక్తికి మహదానందం. నిజానికి అప్పుడే కాదు, ఇప్పటికీ ఉత్తరాలనేవి ఓ అద్భుతమే. కానీ ఉత్తరాలు రాసుకునే రోజులు క్రమేపీ అంతరించిపోవడంతో పోస్టాఫీసులు వెలవెలబోతున్నాయి. వాటితో అవసరం లేకుండా పోయాయి. ప్రేమికుల మధ్య ఉత్తరాల పర్వం ఎంతటి ప్రధాన పాత్ర పోషించాయో వేరేగా చెప్పక్కర్లేదు. ఎదలోని భావాలను ఉత్తరాల ద్వారా ఎంతలా పంచుకునే వారో! ఇప్పుడు అటువంటివారు కూడా నా దగ్గర లొంగిపోయారు. నా ద్వారానే సందేశాలు పంపుకుంటున్నారు. కొంత కాలం క్రితం ఎస్.ఎం.ఎస్‌లే చాలనుకున్నారు.

అవన్నీ పోయి ఇప్పుడు నా వల్ల మీకు ఎంతలా మేలు జరుగుతోందో కదా. ఎవరు ఎక్కడ ఉన్నాసరే ఏ సమయంలోనైనా పలకరించాలనుకుంటే మరుక్షణం నన్ను ఉపయోగిస్తున్నారు ఎంచక్కా. కాల్ చేస్తారు, లేదా వాట్సప్‌లో మెసేజ్ ఇస్తారు. ఒకరికొకరు మాట్లాడుకుంటారు. చాట్ చేస్తారు. ఇది నిజంగా గొప్ప విషయమే కదా. అనుకున్న వెంటనే ఓ డాక్టర్ని సంప్రదించాలంటే అది సాధ్యంకాక ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగితే క్షణాల్లో పిలవడానికి వీల్లేక, వెంటనే పోలీసువారి సాయం పొందలేక గతంలో ఒత్తిడికి లోనై ఉంటారు. ఇందులో అనుమానమే లేదు. మీ అందరికీ నేను విడిగా చెప్పక్కర్లేదు. కానీ నేను వచ్చాక మీరనుకున్న పనులన్నీ క్షణాల్లో చేసేస్తున్నారు. ఎంత గొప్ప విషయం కదూ.

ఇల్లు విడిచి ఏదో పని మీద బయటకు వెళ్లినప్పుడు అమ్మాయిల గురించి తెలుసుకోవడానికి, మాట్లాడటానికి నేను ఎంతలా ఉపయోగపడుతున్నానో కదా కన్న తల్లిదండ్రులకు. ఇది మీకు తెలిసిందేగా. విద్యార్థినులకు నేను ఓ విధంగా భద్రతాయుధమే కదా. కాదంటారా?

ప్రత్యేకించి ఓ బ్లడ్ గ్రూప్ కావాలంటే ఓ మెసేజ్ ద్వారా కోరితే ఎవరో ఒకరు రక్తం ఇవ్వడానికి ముందుకొస్తారు. ఉన్నట్టుండి వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు క్షణాల్లో తెలుసుకోవడానికి నేను ఎంతలా ఉపయోగపడుతున్నానో వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు కదా!

ఓ ప్రముఖ మిత్రుడి మరణ సమాచారం కావచ్చు, లేదా ఒకరి పెళ్లి కబురు కావచ్చు, పండుగలకు శుభాకాంక్షలు చెప్పడానికి కావచ్చు, మంచి ఆలోచనలు పంచుకోవడానికి మంచి మంచి కవితలు పంపుకోవడానికి నేనెంతలా ఉపయోగపడతానో వేరేగా చెప్పాల్సిన పని లేదు. అలాగే నన్ను ఉపయోగించుకుని ఫొటోలు తీసుకోవచ్చు.



కెమెరాతో పని లేకుండా ఫొటోల అవసరాలు తీరడానికి కూడా నేను ఎంతలా ఉపయోగపడతానో తెలిసిందే కదా. అలాగే మాట్లాడటానికే కాక, ఇష్టమైనవారికి ఏదైనా విషయం చెప్పడానికి ఉపయోగపడే అలారం, వాచీ, కాలిక్యులేటర్, కన్వర్టర్, ఒకటేమిటి? బోలెడన్ని సౌకర్యాలు నాలో ఉన్నాయి. అంతెందుకు.. డబ్బు లావాదేవీలకు నన్ను ఉపయోగించే వారెందరో! లెక్కే లేదు. దీని గురించి ఓ పుస్తకమే రాయవచ్చు. ఓ విధంగా ఆలోచిస్తే నేను దాదాపు ఓ అల్లావుద్దీన్ అద్భుత దీపాన్నే. ఎన్నో పనులకు నన్ను మీరు వాడుకోవచ్చు కదూ!

ఇన్ని రకాల సేవలకు ఉపయోగపడే నన్ను మీలో కొందరు తప్పుడు పనులకు ఉపయోగించి లేని పోని ఇబ్బందులకు గురవుతుంటారు. అప్పుడు నాకు ఎంత బాధ వేస్తుందో. నన్ను మంచి పనులకు ఉపయోగించుకోకుండా ఎందుకు దారి తప్పడం? ఈ విషయం తలచుకుంటే నాకు ఎంత ఆవేదన కలుగుతుందో మాటల్లో చెప్పలేను. పైగా నేను సాక్ష్యంగా ఉండటం భరించలేకపోతున్నాను. పరిచయం లేనివారితో నన్ను వాడుకుని అనవసరపు మెసేజులు ఇచ్చి గాయపరచడం, గాయపడటం చూస్తుంటే మనిషి మీద నాకు వచ్చే కోపం ఇంతా అంతా కాదు. పొట్టి సందేశాలు పంపడం మొదలుపెట్టి చెత్తాచెదారం మాటలు, అశ్లీల ఫొటోలు, మాటలు పంపుతూ అవతలి వ్యక్తి మనసుని పాడు చేయడమే కాకుండా తాను చెడిపోవడం చూడలేకపోతున్నాను. అయితే తప్పుడు పనులు చేసేవారిని, అక్రమాలకు పాల్పడేవారిని పట్టుకోవడానికి సైబర్ క్రైమ్ అనే ప్రత్యేక విభాగం పని చేస్తోందన్న విషయాన్ని గుర్తుంచుకుంటే తప్పుడు పనులకు నన్ను ఉపయోగించరు. ఎవరు ఎలాంటి తప్పు చేసినా వారు తమ సాంకేతిక పరిజ్ఞానంతో వారిని పట్టుకుని శిక్షించడం పత్రికల్లో చదివే వుంటారుగా! అందుకే అంటాను.. నన్ను ఉపయోగించేటప్పుడు సభ్యత, సంస్కారాన్ని మరచిపోకండి.

ఒకరితో మాట్లాడాలనుకున్నప్పుడు కాల్ చేసి లైన్లోకి వచ్చేవరకు ఓపికతో నిరీక్షించడం ముఖ్యం. అయితే కొందరు మిస్డ్ కాల్ ఇచ్చి ఎవరి కోసం మాట్లాడుతారనే వారి గురించి నాకు తెలుసు. అది కూడా మంచి పద్ధతి కాదు. సెల్ ఫోన్ కనిపెట్టింది అమెరికన్లు. అయితే అందులో మిస్డ్ కాల్ కనిపెట్టింది ఇండియన్లు అని జోక్‌గా చెప్పేవారున్నారు.

ఒకరు కాల్ చేసినప్పుడు ఆ సమయంలో మాట్లాడలేని పరిస్థితులు ఉంటే ఫోన్‌ని సైలెన్స్‌లో పెట్టాలి. అంతేతప్ప కాల్ కట్ చేయడం అనేది సభ్యత కాదు.

అలాగే ఓ వ్యక్తిని ఇరవై నాల్గు గంటల్లో ఎప్పుడైనా పిలవవచ్చు అని అనుకోవడం సరికాదు, మూర్ఖత్వం. ఒకరికి కాల్ చేయాలనుకున్నప్పుడు కాల్ చేసే ముందు ఇదిప్పుడు సబబేనా? అని ఆలోచించాలి. ముఖ్యమైన విషయం చెప్పబోతున్నామా? అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. ఇప్పుడా అవతలి వ్యక్తి ఆఫీసులో ఉంటారేమో, లేక విశ్రాంతి తీసుకుంటున్నారేమో అని ఆలోచించాలి.

ఇలా పరిపరి విధాలుగా ఆలోచించాక కాల్ చేయడం సముచితం. కొందరు కాల్ చేసి ఏమీ లేదు ఉత్తినే ఫోన్ చేశాను, కాలక్షేపం కోసం చేసాను. నాకేమీ పని లేదు.. అని ఆగకుండా చెప్తూనే ఉంటారు. అప్పుడు అవతలి వ్యక్తి పరిస్థితేమిటో ఆలోచించండి.

విదేశాల్లో ఉన్న వ్యక్తితో మాట్లాడాలనుకున్నప్పుడు ఆ దేశంలో అప్పుడు టైమెంత అన్న విషయం తెలిసుండాలి. ఎందుకంటే మన టైమింగ్స్ వేరు, అమెరికా టైమింగ్స్ వేరు. కనుక ఈ దిశలోనూ ఆలోచించాలి కాల్ చేసేటప్పుడు.

ఇవన్నీ చూడటానికి చిన్న చిన్న విషయాలే అనిపించవచ్చు. కానీ ముఖ్యమైనవి అని తెలుసుకోవాలి.

ఇక్కడో మాట చెప్పాలి.

ఇరవై నాలుగ్గంటలూ నాతో కాపురం చేసే వారున్నారు. అది మంచిది కాదు. వైద్య శాస్త్ర పరంగా చెప్పిన మాట అది. ఎవరో ఉత్తినే వదంతులు పుట్టించిన మాట కాదు. ఎడమ చెవిలో సెల్ ఫోన్ మాట్లాడటం మంచిది. నిద్ర పోతున్నప్పుడు పక్కనే ఫోన్ పెట్టుకోవడం సరికాదు. ప్యాంట్ జేబులో కూడా గంటల తరబడి నన్ను పెట్టుకోవడం మంచిది కాదు.

నేను నీటిలో పడిపోతే మీరుగా నన్ను బాగుచేయడానికి ప్రయత్నించకండి. నేను తడిగా వున్నప్పుడు నా బ్యాటరీని చార్జ్ చేయడానికి ప్రయత్నించకండి.

నన్ను శిశువుల సమీపంలో ఉంచకండి. పెట్రోల్ బంకులలో ఎట్టి పరిస్థితుల్లోనూ నన్ను వాడకండి. వాహనాలు నడిపేటప్పుడు నన్ను ఉపయోగించకండి. అది ప్రాణానికే ముప్పు. కనుక నన్ను ఉపయోగించే విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలి, మితంగా ఉండటం మంచిది.

ఓ కత్తి డాక్టర్ చేతిలో ఉన్నప్పుడు ఓ మనిషి ప్రాణం కాపాడుతుంది. అదే కత్తి ఓ హంతకుడి చేతిలో ఉంటే ప్రాణం తీసే ఆయుధం. దయచేసి నన్ను ఓ మంచి పరికరంగా ఉపయోగించుకోమని నా విజ్ఞప్తి.

నాగరికత చాలా ముఖ్యం.

ఇట్లు సెల్‌ఫోన్

**- యామిజాల జగదీశ్**






**పద కవితా పితామహుడు, తాళ్ళపాక అన్నమయ్య దక్షిణ భారతావనిలో తొలి సంగీత సంకీర్తనాచార్యునిగా 32,000 సంకీర్తనలతో తెలుగు భాషలో, శ్రీ వేంకటేశ్వర భక్తితత్వ శిఖామణిగా, జగద్విఖ్యాతి పొందారు. మహావిష్ణువు ఖడ్గమైన 'నందకం' అంశగా అన్నమయ్య అవతరించారని, అన్నమయ్య చరిత్ర అనే ద్విపద కావ్యం తెలియచేస్తోంది.**

# తెలుగు పాటకు ఆద్యుడు 'అన్నమయ్య'

సంస్కృతంలో తప్ప మరే భాషలో రాసినా అది కవిత్వం కాదు అనుకునే కాలంలో, తాళ్ళపాక అన్నమాచార్యులు జానపద బాణీలలో, వాడుక భాషలో తరతరాలుగా నిలిచిపోయే సాహిత్యం సృష్టించారు. అన్నమయ్య సామాన్య జన జీవితాన్ని ప్రతిబింబింపచేసే మధుర సంకీర్తనలతో తెలుగును జీవద్భాషగా సుసంపన్నం చేసారు. దేశ భాషలో చందమామ పాటలు, ఉగ్గుపాటలు, దోబూచి పాటలు, లాలి, జోల, ఉయ్యాల వంటి చిన్న పిల్లల పాటలు రాసిన అన్నమయ్య సాహితీ విప్లవం సృష్టించారు. ఈయన సంకీర్తనలే రామదాసు, క్షేత్రయ్య, త్యాగయ్య వంటి తరువాతి వాగ్గేయకారులకు మార్గదర్శకమయ్యాయి. అన్నమయ్య సంకీర్తనలు తెలుగు వేదాలై విలసిల్లుతున్నాయి. ఆబాలగోపాలం జన సామాన్యం తమ మాటల్లోనే పాటలు పాడుకొని, శ్రీ వేంకటేశ్వర మంత్రాలను సంకీర్తనల రూపంలో పాడుకొని తరించాలని అన్నమయ్య సంకీర్తనోద్యమానికి తెలుగులో శ్రీకారం చుట్టారు. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి, అన్నమయ్య రచనల గురించి ఇలా రాశారు "అవి జాజర చందమామలు. కోవెల, చిలుక, తుమ్మెద పదాలు. లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, జోలపాటలు, అది విజయీభవ, శోభన మంగళ వైభోగాలు, మంగళారతులు, జయమంగళాలు, ఛాంగుబళాలు, తందనాలు, వాటన్నింటి ద్వారా శ్రీ వేంకటేశ్వర తత్వాన్ని బోధించారు".

అయిదు వందల సంవత్సరాల క్రితం, అన్నమాచార్యులు జాతి, మత, కుల భేదాలను నిరసిస్తూ మానవునికి భగవంతునికి సంబంధానికి జాతి, రంగు, ఆర్థిక స్తోమతలు దూరంగా వుంటాయని పేర్కొనడం, 'తందనానా తానతందనా', 'ఏ కులజుడవైననేమి?', 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' వంటి అభ్యుదయ భావ ప్రధాన సంకీర్తనలు రచించడం తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని పొందాయి.

"వేదంబులు, పౌరాణిక వాదంబులు, వర కవిత్వ వాణీ వీణా నాదంబులు, కృత సుజనాహ్లాదంబులు తాళ్ళపాక అన్నమయ్య పదములే" అన్నారు తాళ్ళపాక చిన తిరుమలయ్య. తెలుగు పాటకు ఆద్యుడు, తెలుగు జానపదానికి వెలుగు అయిన అన్నమయ్య విరచిత సాహిత్యం నాలుగు వందల ఏళ్ళకు పైగా మరుగున పడింది. తెలుగు




భాషలోని తేట మాధుర్యాన్ని పుక్కిట పట్టిన, వాడుక పదాల వేడుకైన పాటల రచనను రచించి స్వరపరిచిన అన్నమయ్య తొలి వాగ్గేయకారుడైన అగ్రగణ్యుడు. అచ్చతెనుగు నుడికారంతో, తెలుగు పల్లెపట్టు పదాలతో పండితులకు, పామరులకు అర్థమయ్యే సంకీర్తనలను అన్నమయ్య తాళపత్రాలపై రచించారు. ఆయన కీర్తనలన్నింటినీ ఆయన కుమారుడు తిరుమలాచార్యులు రాగిరేకులపై చెక్కించి శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో భండాగారంలో భద్రపరిచారు. శతాబ్దాల తరబడి అవి వెలుగు చూడలేదు. 1403లో జన్మించి 1508లో కీర్తిశేషులైన అన్నమయ్య జీవిత కాలంలో సృష్టించిన అమూల్య సాహితీ సంపద, మొదటిసారిగా 1949లో వెలుగు చూసింది. వేటూరి ప్రభాకర శాస్త్రి, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ వంటి మహనీయుల కృషి ఫలితంగా 14 వేల సంకీర్తనలు అందుబాటులోకి వచ్చాయి. కానీ 1200 పదాలకే స్వరకల్పన పూర్తయి పదం పాటగా జనరంజకమైంది. మంగళంపల్లి బాలమురళీకృష్ణ, శ్రీరంగం గోపాలరత్నం, శోభారాజ్, గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ వంటి మేటి సంగీత కళాకారులు ఎందరో పదాలకు జీవం అందించారు. 1979లో తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాటు చేసిన అన్నమాచార్య ప్రాజెక్ట్ ఎందరో గాయకులను ప్రోత్సహించింది. కేవలం తెలుగుభాష, భక్తిభావోద్విగ్నతకు ప్రాధాన్యం యిచ్చే అన్నమయ్య సంకీర్తనలు అచ్చ తెలుగు పదాలు నుడికారాలతో తెలుగు సాహితీ వెలుగులను ప్రసరింపచేస్తున్నాయి. అన్నమయ్య మార్గం రక్తి మార్గంలో ముక్తిసాధన. తెలుగు భాషాభిమానులు, తెలుగు కనుమరుగైపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తుంటారు. అన్నమయ్యను మనం బతికించుకుంటే అన్నమయ్య సాహిత్యం తెలుగు భాషను అజరామరం చేస్తుంది.



అన్నమాచార్యుని కొడుకులు, మనుమలు యావత్తు తాళ్ళపాక కవులు దాదాపుగా యాభై వేల కీర్తనలు రచించారని ఒక అంచనా. అన్నమయ్య తెలుగువానిగా పుట్టడం తెలుగువారి సుకృతం. తిరుమల వేంకటేశ్వరుని సన్నిధికి అన్నమయ్య సమర్పించిన తెలుగు సంకీర్తనల నిధి, కాలానికి అతీతంగా ఆధ్యాత్మిక కాంతి ప్రసరింపచేస్తోంది.

**- జయసూర్య**




వరల్డ్ రూఫ్ టాప్‌గా పరిగణించే లడక్ సుందరమైన ఒక ప్రదేశం. పర్యాటకులకు స్వర్గధామం. ముఖ్యంగా జూన్, జులై మాసాల్లో లడక్‌లోని వివిధ ప్రాంతాలు సందర్శించడానికి చాలా మంది యాత్రికులు ఇక్కడకు వస్తుంటారు. యువతీ యువకులు వారి సైకిల్ మోటార్లపై సాహసోపేతంగా ప్రయాణించడానికి ప్రపంచంలోని అతి ఎత్తయిన ప్రాంతమైన కార్దుంగ్‌లాపాస్ ప్రాంతానికి మొదటి ప్రాధాన్యం ఇస్తారు.

# పర్యాటకుల స్వర్గధామం 'లడక్'

ఈ ప్రాంతంలో విహరించిన వారం రోజులు ప్రకృతిలో లీనమైనట్టుగా జీవితం సాగిపోతుంది. స్వచ్ఛంగా తెల్లగా మెరిసిపోతున్న మంచుకొండలు, గడ్డకట్టే చలిగాలులు, ఆకాశంలో నక్షత్రాలు, కిలోమీటర్లకొద్దీ కానరాని మనుషులు, కుడివైపు అంతా కారకోరం పాస్ పర్వత శిఖరాలు, పర్వతాలపై పడి కరిగిపోతున్న మంచు తాలూకు నీటితో లోయలోకి ప్రవాహంలా దూసుకుపోతున్న సయోక్ నది, ఎడమ వైపు ఎంతో ఇరుకైన రహదారి పర్యాటకులను ఆనందంలో ముంచెత్తుతాయి.

లడక్‌లోని లేహ్ ప్రాంతం సముద్ర మట్టానికి సుమారు పన్నెండు వేల అడుగుల ఎత్తులో ఉండే అందమైన ప్రదేశం. దీని పురాతన చరిత్రను పరిశీలిస్తే మొదటి శతాబ్దంలో కుషాన్ చక్రవర్తి కాలంలోనే లడక్ నుండి ఇండియాకు చైనా ద్వారా వ్యాపార సంబంధాలు ఉండేవనీ, దీన్ని సిల్క్ రోడ్‌గా వ్యవహరించారని తెలుస్తోంది. ఇండియాలోని చివరి గ్రామమైన తుర్‌తుక్ అనే గ్రామ ప్రాంతం ద్వారా సిల్క్ రూట్‌గా ప్రాముఖ్యం వహించిన ప్రాంతం ఇప్పటికీ దర్శనీయ ప్రదేశాల్లో ఒకటిగా ఉంది.

పర్యావరణ మార్పులు, మామూలు వర్షపాతం కంటె అత్యధిక వర్షం పడుతున్న వంద ప్రాంతాల్లో లేహ్ ఒకటి. లడక్ అంటేనే ల్యాండ్ ఆఫ్ హై పాసెస్‌గా పరిగణిస్తారు. ఈ మౌంటేన్ రేంజెస్ సముద్ర మట్టానికి 16400 అడుగుల నుండి 22000 అడుగుల ఎత్తులో ఉంటాయి. ఇవి దాదాపు 45 మిలియన్ సంవత్సరాల క్రితం తయారు అయినట్టుగా పరగణిస్తున్నారు. ఇదే ప్రాంతంలోని కారకోరం పాస్ శిఖరాలు సముద్ర మట్టానికి 18875 అడుగుల ఎత్తు నుండి 25171 అడుగుల ఎత్తు వరకు ఉంటాయి.

ప్రపంచంలోనే అతి ఎత్తయిన మోటరబుల్ రోడ్ ఈ ప్రాంతంలోనే ఉంది. మౌంటేన్ బైకింగ్‌కు ఎంతో ప్రాముఖ్యంగా ఉండే ఈ రోడ్డు సముద్ర మట్టానికి 17893 అడుగుల ఎత్తులో ఉండే ఈ ప్రాంతాన్ని కర్‌దుంగ్‌లా పాస్‌గా పరిగణిస్తారు. దక్షిణ ఆసియాలోని అతి పెద్ద పార్క్‌గా పిలవబడే హెర్మీస్ నేషనల్ పార్క్ ఇక్కడే ఉంది.

వారం రోజుల లడక్ యాత్రలో మొదటి రోజు శాంతిస్తూపం దర్శించాం. ఇది 11841 అడుగుల ఎత్తులో కొండపై చందస్పా అనే గ్రామంలో ఉన్న తెల్లని బౌద్ధ స్థూపం. తరువాత లేహ్ ప్యాలెస్ దర్శించుకున్నాం. టిబెట్ స్టైల్‌లో వున్న తొమ్మిది అంతస్తుల రాజభవనమిది. లేహ్ ప్యాలెస్ ఎంతో ప్రాముఖ్యమున్న రాజభవనం. అక్కడి నుండి హాల్ ఆఫ్ ఫేంకి వెళ్లాం. ఇండో పాక్ యుద్ధంలో ఇండియాను రక్షించడానికి తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీర భారత సైనికుల జ్ఞాపకార్థం నిర్మించారు. ఈ మ్యూజియం లేహ్ నగరానికి నాలుగు కి.మీ. దూరంలో ఉంటుంది. కార్గిల్ యుద్ధ సమయంలో ఉపయోగించిన వివిధ రకాల ఆయుధాలు, సియాచిన్ ప్రాంతంలో భారత సైన్యం ఉపయోగించిన వివిధ రకాల దుస్తులు, మంచులో కర్తవ్య నిర్వహణలో ఉన్న సైనికుల చిత్రాలు, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న యుద్ధ చిత్రాలు, దేశాన్ని కాపాడడం కోసం తమ ప్రాణాలను అర్పించిన సైనికుల చిత్రాలు ఎంతో ఉత్తేజాన్ని కలిగిస్తాయి.

మూడవ రోజు ప్రయాణం ఆద్యంతం హాలీవుడ్ సినిమాల్లో చూపించినట్లుగా ఎత్తయిన కొండలు, లోతైన లోయలు, ఆ ప్రాంతమంతా ప్రకృతి తప్ప మరెవరూ లేనట్టుగా అద్భుతంగా సాగింది ప్రయాణం.

ఈ కర్‌దుంగ్‌లా పాస్ మార్గాన్ని 1976లో ఆర్మీవారు సియాచిన్ ప్రాంతంలో పహారా కాచే సైనికులకు నిత్యావసర వస్తువులు, ఆయుధాలు చేరవేయడం కోసం నిర్మించినట్లు



చెప్పారు. 1988 వరకు ఆర్మీ అవసరాలకు మాత్రమే దీనిని వాడేవారు. ఆ తరువాత యాత్రికులను కూడా అనుమతిస్తున్నారు. సంవత్సరంలో 9 నెలలు మంచుతో కప్పబడి ఉండే ఈ రోడ్డు మూడు నెలలు మాత్రమే రహదారిగా ఉపయోగిస్తారు. ప్రపంచంలో ఎత్తయిన మోటరబుల్ రోడ్ పైన ప్రయాణం సాహసోపేతంగా అనిపించింది. పార్కింగ్ ప్లేస్ నుండి కర్‌దుంగ్‌లా పాస్ ఓ మూడు, నాలుగు వందల ఫీట్ల దూరంలో ఉంటుంది.



దారిలో షయాక్ వార్ మెమోరియల్స్ దర్శించుకొని సియాచిన్ ప్రాంతంలో దేశం కోసం ప్రాణం త్యాగం చేసిన అమరవీరులకు అంజలి ఘటించి వారి త్యాగాలను గుర్తుకు తెచ్చుకున్నాం.

## డిక్‌సిక్ మోనాస్ట్రీ

డిక్‌సిక్ మోనాస్ట్రీ 101315 అడుగుల ఎత్తులో 14 శతాబ్దంలో చాంగ్ జెమ్ తెసరాజ్ జాంగ్పో స్థాపించారు. ఈ మఠం సమీపంలో 106 అడుగుల ఎత్తయిన మైత్రేయ బుద్ధ విగ్రహం సయాక్ నదికి ఎదురుగా నుబ్రావ్యాలీ వైపు ఉంటుంది. డిక్‌సిట్ మోనాస్ట్రీ నుండి అతి ఎత్తయిన ప్రదేశంలో అతి చల్లని ఎడారిగా పిలవబడే హుందర్ గ్రామంలోని ఇసుక తిన్నెలకు వెళ్లాం.


నుబ్రా వ్యాలీని వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ అని కూడా అంటారు. నుబ్రా నది(సియాచిన్ నది అని కూడా పిలుస్తారు), సయోక్ నది ప్రవహించే అందమైన లోయ ప్రాంతాన్ని నుబ్రా వ్యాలీగా వ్యవహరిస్తారు. సముద్ర మట్టానికి 10000 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతంలో రెండు రాత్రులు టెంట్‌లో ఉన్నాం. ఇది ప్యాంగాంగ్‌సో లేక్ వద్ద గడపబోయే ఒక రాత్రికి ప్రిపరేటివ్‌గా ఉండే విధంగా ఉపయోగపడుతుంది.

మరుసటి రోజు ఉదయం దినచర్య ముగించుకుని ఇండియా-పాకిస్థాన్ బార్డర్‌లోని చివరి గ్రామమైన తుర్‌తుక్ గ్రామాన్ని చూడ్డానికి వెళ్లాం. రెండు గంటల ప్రయాణం తర్వాత హిమాలయ ప్రాంతంలోని కారకోరం రేంజ్‌లోని తుర్‌తుక్ గ్రామంలోకి ప్రవేశించాం. అప్రికాట్, వాల్‌నట్ ఇక్కడ సమృద్ధిగా లభిస్తాయి.

తిరుగు ప్రయాణంలో హుందర్ గ్రామం నుండి ప్యాంగాంగ్‌సో సరస్సుకి దాదాపు 274 కి.మీ. ప్రయాణం చేసి సాయంత్రం 5 గంటలకి చేరుకున్నాం. సముద్ర మట్టానికి 13862 అడుగుల ఎత్తులో ఉండే ఈ సరస్సు అంతర్లీనంగా త్సోనాక్, రమ్‌త్సో-జంట సర్సులు, న్యాక్‌స్తో అనే ఐదు ఉప సరస్సులతో మిళితమై ఉంటుంది. ఈ సరస్సు 50 శాతం చైనా భూభాగంలో, 40 శాతం ఇండియా భూభాగంలో, 10 శాతం రెండు దేశాల పరిధిలో ఉన్నది. లేహ్‌లో గడిపిన రెండు రోజులు, నుబ్రా వ్యాలీలోని హుందర్‌లో గడిపిన అనుభవం ప్యాంగాంగ్‌సోలోని ఒక రాత్రి గడపడానికి ఉపయోగపడింది. ఉదయం ప్యాంగాంగ్‌సో సరస్సు మీదుగా వస్తున్న సూర్యోదయ చిత్రం ఎంతో అద్భుతంగా ఉంటుంది.

ఈ లేక్‌లోని నీటి రంగు మారుతూ ఉంటుంది. నీటి అడుగు భాగం కూడా స్వచ్ఛంగా కన్పించేలా ఉంటుంది. చలి కాలంలో గడ్డ కట్టిన లేక్‌లో నిర్వహించబే ట్రెక్కింగ్ ఇక్కడి ప్రత్యేకత.

ఆ మరునాడు అంటే చివరి రోజు యాత్ర కొనసాగింపుగా సాహస యాత్ర మళ్లీ కొనసాగింది. తిరుగు ప్రయాణం 150 కి.మీ. దూరం ప్రపంచంలోని రెండో ఎత్తయిన ప్రదేశం చాంగ్లాపాస్ 17857 అడుగుల ఎత్తులో ఉన్న ఉన్న ఈ ప్రాంతంలో చాలా వరకు ల్యాండ్ స్లైడ్స్ జరగడం మూలాన డ్యామేజి అయిన రోడ్లతో, విపరీతంగా మంచుపడి వాటి ప్రవాహంతో కొట్టుకుపోయిన రోడ్లపై బ్రిడ్జిల నిర్మాణం వల్ల ప్రయాణం ఆగుతూ, సాగుతూ సాగింది. ఆరు గంటలు ప్రయాణించి షేప్యాలెస్‌లోకి ప్రవేశించాం. దీన్ని 15 కి.మీ. దూరంగా ఉన్న లేహ్-మనాలి రోడ్డులో 11204 అడుగుల ఎత్తులో ఉంది.



లడక్‌కి గతంలో వేసవి కాలంలో క్యాపిటల్‌గా ఉన్న ఈ ప్రాంతంలో బుద్ధుని అవతారమైన షాక్యముని బుద్ధ రెండవ అతిపెద్ద స్థూపం 39 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడి నుండి సింధునది ప్రాంతం ఎంతో అద్భుతంగా కనిపిస్తుంది.

థిక్‌సె మోనాస్ట్రీ లడక్‌లోని అతిపెద్ద మోనాస్ట్రీల్లో ఒకటి. ఇది 11800 అడుగుల ఎత్తులో ఉంటుంది.

49 అడుగుల ఎత్తయిన మైత్రేయ బుద్ధ విగ్రహం ఇక్కడి ముఖ్య ఆకర్షణ. చివరిదైన థిక్‌సె మోనాస్ట్రీ దర్శించుకొని లేహ్‌లోని మా విడిదికి చేరుకొని తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాం. జీవితంలో అత్యద్భుతమైన సాహసయాత్రగా, చిరస్మరణీయ జ్ఞాపకాలంలో మా యాత్ర ముగిసింది.

**- రంగరాజు శ్యాంసుందర్ రావు**



సింగిల్ పేజీ కథ

# చూపులు కలిసిన శుభవేళ

కనుమ ఎల్లారెడ్డి

రాజారావు కూలిపనులు చేసుకుంటూ పైసా పైసా కూడబెట్టి దాదాపు మూడు లక్షల వరకు పోగు చేశాడు. ఇదంతా తన కూతురు చందన పెళ్లికోసం.

తల్లి పురిట్లోనే కన్ను మూస్తే కూతురి ఆలనా పాలనా చూశాడు. రెండో పెళ్లి చేసుకోమని ఎందరో చెప్పి చూశారు.

"వద్దు.. నా కూతురిని సరిగ్గా చూడకపోతే ఆ బాధ నేను భరించలేను" అని చెప్పేసాడు.

చందన కుందనపు బొమ్మ. చూడచక్కగా ఉంటుంది. చందన గురించే ఆలోచిస్తూ ఎప్పుడో నిద్రపోయాడు. ఓ మంచి సంబంధం తేవాలని వరుడి కోసం వెదుకుతున్నాడు. ఆరోజు ఇంటి సరుకుల కోసం పట్నం బయలుదేరాలి అని నిర్ణయించుకున్నాడు. సరుకులు తీసుకుని వస్తుండగా మార్గం మధ్యలో బస్సు చెడిపోయింది.

కండక్టర్ "ఈ బస్సు వెళ్లదు, మీరు మీ సొంతంగా వెళ్లండి. ఈ దారిలో మరో బస్సు వచ్చే అవకాశం కూడా లేదు. చీకటి పడముందే ఊరికి చేరుకోండి" అన్నాడు.

అందరూ తమ సొంత వ్యక్తులకు, తెలిసిన వాళ్లకు ఫోన్లు చేసి రప్పించుకుంటున్నారు. తన దగ్గర సరుకులు ఎక్కువ ఉన్నాయి, ఎవరు ఎక్కించుకుంటారు? అని ఆలోచనలో పడ్డాడు. చూస్తుండగనే ప్రయాణికులు అందరూ తమ వాళ్లతో వెళ్లిపోయారు.

అప్పటికే చీకటి పడుతోంది. అలానే ఎదురు చూస్తున్నాడు.

ఇంతలో దూరంగా ఏదో బైక్ వస్తుంటే చేయి చూపించి నిలబెట్టమని సైగ చేశాడు. ఆ వ్యక్తి ఆగిపోయిన బస్సుని చూసి "బస్సు చెడిపోయిందా ఏమిటి?" అన్నాడు.

"అవును బాబు, కాస్త మా ఊరు దగ్గర విడిచిపెట్టు, ఈ రాత్రికి మీరు అక్కడే వుండి ఉదయమే వెళుదురుగానీ" అని చెప్పాడు.

ఆ స్థితిలో ఆ వ్యక్తిని చూసి జాలిపడ్డాడు. సహాయం చేయాలనిపించి "రండి" అన్నాడు.

రాజారావు బైక్ ఎక్కి "పదండి" అన్నాడు.

బైక్ అతను ఏమీ మాట్లాడలేదు. రాజారావే కల్పించుకుని "మీది ఏ ఊరు?" అని అడిగాడు.

"మాది తాడిపత్రి, ఇక్కడ ఓ పెళ్లి సంబంధం వుంటే చూసి వస్తున్నాను" అన్నా డు.

"అమ్మాయి నచ్చిందా?, మీ అమ్మా నాన్నలు వగైరా?" అని అడిగాడు.

"నాకు ఎవరూ లేరు. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. కష్టపడి చదువుకుని తాడిపత్రిలోని స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్నాను. నాకు ఎవరూ లేరని పిల్లని ఇవ్వమన్నారు" నవ్వుతూ చెప్పాడు.

రాజారావు మదిలో ఓ ఆలోచన మెరిసింది. తన కూతురిని ఇస్తే ఒప్పుకుంటాడా? అన్న ఆలోచనలో పడ్డాడు.

ఇద్దరూ ఊరిలోకి వచ్చారు.

"ఇల్లు ఎక్కడ?" అడిగాడు.

"ఆ వేపచెట్టు దగ్గర ఆపు" అన్నా యి.

ఇంతలో చిన్నగా జల్లులు మొదలైనాయి. నాన్న ఇంకా రాలేదని ఎదురు చూస్తోంది చందన.

అప్పుడే ఇంటి ముందు బైక్ ఆగింది.. "రండి బాబూ, ఉదయమే వెళుదురుగానీ" అన్నాడు.

తండ్రితో పాటు వున్న యువకుడిని చూసి చందన ఆశ్చర్యపోయింది.

"భోంచేద్దువు పద బాబు" అన్నాడు. వెంటనే వేడి వేడి భోజనం, కొన్ని బజ్జీలు, అప్పలం చటుక్కున చేసింది. "రండి భోజనం చేద్దురుగాని" అంది చందన.

చందనను ఒక్క క్షణం అలానే చూస్తూ ఉండిపోయాడు. చందన కూడా కన్నార్పకుండా చూస్తోంది అతడిని.

"పద బాబూ లోపలికి" అన్నాడు.

"బస్సు చెడిపోతే ఇతనే నన్ను ఆదుకున్నాడు. లేకపోతే ఈ రాత్రికి ఇల్లు చేరేవాడిని కాదు" అన్నాడు అమ్మాయితో.

"కాళ్లు, ముఖం కడుక్కోండి" అని బాత్‌రూమ్ చూపించింది. అమ్మాయి ఒద్దికగా ఉంది, మాట కూడా సౌమ్యంగా ఉంది. బైట వర్షం జోరందుకుంది.

"భోంచేద్దువు పద బాబు" అన్నాడు.

వెంటనే వేడి వేడి భోజనం, కొన్ని బజ్జీలు, అప్పలం చటుక్కున చేసింది. "రండి భోజనం చేద్దురుగాని" అంది చందన. ఇద్దరూ భోజనానికి నడిచారు.

"మీ పేరు" అడిగాడు రాజారావు.

"కళ్యాణ్" అని చెప్పాడు.

చందన కొసరి కొసరి వడ్డిస్తుంటే ఆమెనే చూస్తున్నాడు.

చందన కూడా అతనినే చూస్తోంది.

"అప్పలం ఇంకొకటం వేసుకోండి బాబూ" అంటే– చందన రెండు వేస్తుంటే "ఒక్కటి చాలు" అన్నాడు.

చందన నవ్వుతూ వంటింట్లోకి వెళ్లింది. ఆమె వెళుతుంటే వాలుజడ అటు, ఇటు ఊగుతోంది. కళ్యాణ్ అలానే చూస్తున్నాడు.

అది గమనించాడు. రాజారావు.

చందన కూడా అతనినే చూస్తోంది.

భోజనాలు అయ్యాక తాంబూలం సిద్ధం చేసింది చందన. భోజనం ముగించి ఇద్దరూ ముందు గదిలోకి వచ్చారు. చందన, కళ్యాణ్ ఒకరినొకరు చూసుకోవడం మానలేదు. అది గమనించి రాజారావు "మా అమ్మాయి అంటే నీకు ఇష్టమేనా?" అడిగాడు.

ఆ మాట వినిపించింది చందనకు. కళ్యాణ్ ఏమి చెబుతాడోనని చెవులు రిక్కించింది.

"ఇష్టమే" అన్నాడు.

"బాబూ, నాకున్న ఆస్తి ఈ ఇల్లొక్కటే. బ్యాంకులో మూడు లక్షల వరకు డబ్బు ఉంది. అదే ఇవ్వగలను" అన్నాడు.

"అవన్నీ ఏమీ వద్దు, అందరం తాడిపత్రికి వెళదాం. నాకు మీరే తల్లీ, తండ్రీ. ముగ్గురం కలిసి హాయిగా ఉందాం" అన్నాడు కళ్యాణ్.

అతని మంచి మనసుకి కరిగిపోయాడు రాజారావు. "చందనా" అని పిలవగానే సిగ్గు పడుతూ వచ్చింది.

తల ఎత్తి చూసింది కళ్యాణ్ వైపు. ఆ చూపులలో ఎన్ని భావాలో!

"రామ్మా, కళ్యాణ్ అంటే నీకు ఇష్టమేనా?" అని అడిగాడు.

తల ఆడించింది చందన.

ఇద్దరి చేతులు కలిపాడు రాజారావు.

బైట వర్షం ఆగిపోయి చల్లగాలి వీస్తోంది. ఎవరో ట్రాన్సిస్టర్ పెట్టుకొని వెళుతున్నారు.

అందులోంచి "చూపులు కలిసిన శుభవేళా..' అనే పాట మంద్ర స్థాయిలో వినపడింది.

ఇద్దరూ రాజారావు కాళ్లకు మొక్కారు. ఆనందంతో వాళ్లను లేవనెత్తి అక్కున చేర్చుకున్నాడు రాజారావు.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



సంతానాన్ని క్రమశిక్షణాయుతమైన బాటలో నడిపించడానికి సమాయత్తమవుతారు. రుణాలను చాలా వరకు తీర్చి వేస్తారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. పోటీతత్వం పెంచుకుంటారు. కొత్త సేవకా సిబ్బందిని నియమించుకుంటారు. నిజమైన శ్రేయోభిలాషులు ఎవరన్నది తెలుసుకుంటారు. లీజులు పొడిగించబడతాయి.

## వృషభం



సానుకూల ఫలితాలు గోచరిస్తున్నాయి. ఆర్థిక స్థితి అనుకూలంగా ఉంటుంది. చెల్లింపులను చాలా వరకు చెల్లించివేస్తారు. మొండికి పడిన పనులలో కదలిక ఏర్పడుతుంది. మిత్రుల సహకారం వల్ల లాభపడతారు. దూర ప్రాంత ప్రయాణాలు, అందుకు మీరు చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఉద్యోగ పరంగా మీ స్థాయి పెరుగుతుంది.

## మిథునం



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. ప్రతికూల వాతావరణంలో అనుకూల ఫలితాలను సాధించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తారు. ప్రతి పనినీ కష్టించి సాధించుకోవలసి రావడం చికాకుగా పరిణమిస్తుంది. కొండను మోయటం కన్నా కుటుంబ బరువు బాధ్యతలను మోయటం కష్టతరమని భావిస్తారు. విలువైన వస్తువుల భద్రత పట్ల జాగ్రత్త.

## కర్కాటం



అనుకూలంగా ఉంటుంది. సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. నేల విడిచి సాము చేయకుండా కలిగిన దానితోటి సంతృప్తి పడతారు. గౌరవప్రదమైన జీవితం గడపడానికి క్రమశిక్షణాయుతమైన ప్రణాళికలు రూపొందించుకుంటారు. ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉంటాయి. నూతన వస్తు, వస్త్రాలను కొనుగోలు చేస్తారు. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటారు.

## సింహం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. కనుమరుగు అయ్యాయి అనుకున్న వస్తువులు తిరిగి దరి చేరతాయి. కొనుగోలు-అమ్మకాలకు సంబంధించిన వ్యవహారాల్లో నిదానంగా వ్యవహరించండి. వృత్తి, ఉద్యోగాల పరంగా అనుకూల ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాల్లో మెలకువలు వహించండి. మిత భాషిత్వం అలవరచుకుంటే వివాదాలకు దూరంగా ఉండవచ్చు.

## కన్య



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. పనులలో ఏర్పడే ఆటంకాలను నివారించడానికి నిత్యం శ్వేతార్క గణపతిని పూజించడం చెప్పదగింది. ఆదాయ, వ్యయాలు సమానంగా ఉంటాయి. సందర్భోచితంగా వ్యవహరించి లాభపడతారు. వీసా, పాస్‌పోర్ట్ వంటి అంశాలు సానుకూలపడతాయి. బంధు వర్గంతో ఏర్పడిన వివాదాలు తొలగిపోతాయి.

## తుల



అనుకూల ఫలితాలు గోచరిస్తున్నాయి. చర్చలు, ప్రయాణాలు సానుకూల ఫలితాలను ఇస్తాయి. స్వార్థం లేకుండా పని చేయరు. ధన సముపార్జనకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. వ్యాపార విస్తరణా కార్యక్రమాలు కలిసి వస్తాయి. టెండర్స్, పెండింగ్ బిల్స్ చేతికంది వచ్చే సూచనలున్నాయి. ప్రతి పనిలోనూ సాంకేతిక పరమైన లోపాలు చోటు చేసుకోవడం వలన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి.

## వృశ్చికం



సానుకూల ఫలితాలు సాధిస్తారు. సమయస్ఫూర్తితో తీసుకున్న నిర్ణయాల వల్ల లాభపడతారు. అర్థంలేని వివాదాలు చోటు చేసుకుంటాయి. ఆర్థికంగా చెప్పుకోదగిన ఇబ్బందులేవీ ఏర్పడవు. మీ మాటలకు వక్ర భాష్యాలు చెప్పేవారు అధికమవుతారు. మీ సహనానికి పరీక్షలు ఎదురవుతాయి. కుటుంబంలో ఏర్పడే స్పర్ధలను ఆదిలోనే నివారించుకుంటే మంచి ఫలితాలు సాధిస్తారు. యోగా పైన దృష్టి సారిస్తారు.

## ధనుస్సు



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఇష్టంలేని కార్యక్రమాలను అతి కష్టం మీద నిర్వహించాల్సి వస్తుంది. ఆర్థిక స్థితులు ఏ దిశగా పోతున్నాయో గమనించడం కష్టసాధ్యమవుతుంది. అభద్రతా భావాన్ని కలిగి వుంటారు. ఇందుకు ప్రత్యేకమైన కారణాలేమీ ఉండవు. ప్రచారంలో వున్న పుకార్లను నిజమని నమ్ముతారు. ఇతరుల సలహాలను ఎక్కువగా తీసుకుంటారు. పెట్టుబడులకు అనుకూలమైన కాలం కాదు.

## మకరం



అనుకూల ఫలితాలు సాధిస్తారు. స్థిరాస్తులను వృద్ధి చేసుకోవాలనుకునే మీ ఆలోచనలు కలిసి వస్తాయి. కాలం అనుకూలంగా పరిణమిస్తుంది. శుభ కార్యాలకు సంబంధించిన చర్చలు నిర్విఘ్నంగా సాగుతాయి. మిత్ర బృందాలను మరింతగా విస్తరిస్తారు. వివాదాలకు దూరంగా ఉంటారు. మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తారు. విద్యార్థులకు అనుకూలమైన సమయం.

## కుంభం



బాకీలను కొంత వరకు తీరుస్తారు. స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలు సానుకూల పడతాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా పురోభివృద్ధి సాధిస్తారు. అధిక ధన వ్యయాన్ని నిలువరించడంలో వైఫల్యం చెందుతారు. జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు చోటు చేసుకుంటాయి. ఆలోచనల విధానంలో మంచి మార్పులు చోటు చేసుకుంటాయి.

## మీనం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూస్తారు. ఆర్థిక పరమైన ఇబ్బందుల నుండి తాత్కాలికంగా బయట పడతారు. సంతాన యోగ క్షేమాల పట్ల అధిక శ్రద్ధ కనబరచవలసి వస్తుంది. పరిస్థితులకు లోబడి ఇష్టం లేకపోయినా కొన్ని పనులు పూర్తి చేస్తారు. చిక్కులను అధిగమిస్తారు. దైవానుగ్రహం వల్ల కీలకమైన విషయాల్లో సానుకూల ఫలితాలు సాధించగలుగుతారు.

# దక్షిణ నైరుతిలో సెప్టిక్ ట్యాంక్ ఉండవచ్చా?




వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458


### పశ్చిమ నైరుతి సెప్టిక్ ట్యాంక్(పోటు)-అశుభం

ఇంటి దక్షిణ గోడ పారు నుండి పడమర ప్రహరీ గోడకు తాడు పట్టి లాగినప్పుడు అది సెప్టిక్ ట్యాంక్ మీదుగా పోతే ఆ ఇంటికి పశ్చిమ నైరుతి సెప్టిక్ ట్యాంక్‌పోటు కూడా ఉన్నట్టు గుర్తించాలి. ఓవర్‌ఫ్లో పశ్చిమ/నైరుతి దిశగా ఉంటే చెడు ఫలితాలు అతి తీవ్రతరం అవుతాయి.

**శుభా శుభ ఫలితాలు:** ప్రమాదాలు, అనారోగ్యం, ధన నష్టం, రుణహానికి అవకాశం వుంది.

**Septic Tank in the West South-West(Strike)-Unfavourable**

When a string held straight from the boundary of the Southern wall of the house to the Western compound wall, passes over the septic tank it means that the house has the strike of the West South-West South West septic tank. If the overflow is towards West or South-West the harmful effect gets very much increased.

**Result:** Accidents, ill-health, loss of money and likelihood of debts.

### పశ్చిమ నైరుతిలో సెప్టిక్ ట్యాంక్-అశుభం

ఇంటికి పశ్చిమ నైరుతిలో సెప్టిక్ ట్యాంక్ ఉన్నప్పుడు దానికి ఎటువంటి పోట్లు లేకపోయినప్పటికీ దుష్ఫలితాలనే యిస్తుంది. ఓవర్‌ఫ్లో పశ్చిమ/నైరుతి దిశలో ఉన్నప్పుడు చెడు ఫలితాలు తీవ్రతరం అవుతాయి. నేల కూడా పశ్చిమ/నైరుతి పల్లమైతే అతి తీవ్రతరం అవుతాయి.

**శుభా శుభ ఫలితాలు:** ప్రాణభయం, ధన వ్యయం, ప్రమాదాలు.

**Septic Tank in the West South-West-Unfavourable**

A Septic Tank in the West South-West, even when it does not have any strike, gives only an unfavourable result. If the overflow is towards West or South West, the harmful effect gets increased. If the ground is also low towards West or South-West the harmful effect gets very much increased.

**Result:** Danger to life, waste of money and accidents.

### నైరుతి సెప్టిక్ ట్యాంక్(పోటు)-అశుభం

ఇంటి స్థలానికి పూర్తి నైరుతి మూలలో సెప్టిక్ ట్యాంక్ ఉంటే ఇంటి నైరుతి మూల నుండి లేదా స్థలం ఈశాన్య మూల నుండి స్థలం నైరుతి మూలకు తాడు పట్టి లాగి చూసినప్పుడు అది సెప్టిక్ ట్యాంకు మీదుగా పోతుంది. అప్పుడు ఆ యింటికి నైరుతి సెప్టిక్ ట్యాంకు పోటు వున్నట్లు గుర్తించాలి.

**శుభా శుభ ఫలితాలు:** అనారోగ్యం, ఆక్సిడెంట్స్, శత్రుభయం, అవగాహనా లోపం, ప్రాణ నష్టాలకు అవకాశం తీవ్రతరంగా ఉంటుంది.

**Septic Tank in the South-West(Strike)-Unfavourable**

If there is a septic tank wholly in the South-West corner of the plot; a string, held straight either from the South-West corner of the house or from the North-East corner of the plot to the South-West corner of the plot, goes over the septic tank. This indicates that the house has the strike of the South-West septic tank.

**Result:** Ill-health, accidents, trouble from enemies, lack of understanding. liklihood of loss of life and hardships and losses.


### దక్షిణ నైరుతిలో సెప్టిక్ ట్యాంక్-అశుభం

ఇంటికి దక్షిణ నైరుతిలో సెప్టిక్ ట్యాంక్ వున్నప్పుడు దానికి ఏ పోట్లు లేనప్పటికీ అనర్థదాయకమై సత్ఫలితాలనివ్వదు. ఈ స్థానంలో సెప్టిక్ ట్యాంకు వున్నప్పుడు ఓవర్‌ఫ్లో పశ్చిమ, దక్షిణాలకు ఉన్నప్పుడు చెడు ఫలితాలు తీవ్రతరమవుతాయి.

**శుభా శుభ ఫలితాలు:** స్త్రీలకు రుణభయం, దీర్ఘకాలిక వ్యాధులు, అసౌఖ్యం, ధన వ్యయం, కష్టనష్టాలు.


**Septic Tank in the South South-West-Unfavorable**

A septic tank in the South South-West of the house, even when it does not have any strike, becomes harmful and does not give any favourable result. If its overflow its towards the West or the South the harmful effect gets increased. **Result:** Possibility of debts for women, chronic illness, unhappiness, expenditures, hardships and losses.



# పదరంగం-8

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. నమ్మకద్రోహం (5)
4. దర్జీలకు తప్పనిసరి (3)
6. పుడమి (2)
7. ఇష్టం లాంటిది (4)
9. గస్తీకి ప్రసిద్ధి (2)
10. వరుస (4)
12. 64 గళ్ల ఆట (4)
14. మ్రోగేవి (3)
15. శివరాత్రికి చేసేది (3)
16. లేగదూడ (3)
19. రఘుపతి రాఘవ రాజారాం... సీతారాం (6)
20. న్యాయవాది (3)
22. జీతం (3)
23. విషయ విశదీకరణ సవ్యంగా లేదు (4)

### నిలువు

2. జాతీయ గేయం (5)
3. మాట తడబడే బలహీనత (2)
4. రకరకాల విషయాలు, వస్తువులు కలిస్తే ఇది ఔతుంది (6)
5. గుట్టు ఎప్పటికైనా.... ఔతుంది (2)
7. ఆందోళనలతో శాంతి భద్రతలు లోపించిన పరిస్థితి (4)
8. ఎల్లప్పుడూ (4)
11. తవ్వడానికి వాడే ఒక పనిముట్టు (3)
13. దీని సాగు నేరం (3)
16. పేలుతుంది జాగ్రత్త (3)
17. పంచిపెట్టడం (4)
18. .....లాడటం అంటే తాజాగా ఉన్నట్లు (4)
19. పడిపోవడం (3)
20. దీపానికి ముఖ్యం (2)
21. 'చూపించేది' పైకి (2)

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,

లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ..............................


..............................

ఊరు : ..............................


## పదరంగం-6 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆ | ది | వా | రం | | చే | | పా | వ | నం |
| క | | స | | ఆ | రా | ధ | న | | ది |
| శిం | | క | రి | నం | | | కం | | |
| పు | నా | స | | దం | డ | | లో | గ | డ |
| | | జ్జి | గ | | గ్గు | ఎ | | ద్ద | |
| పి | చ్చి | క | | | త్తి | | చ | రి | త్ర |
| నా | | | చం | ద్రి | క | | ద | | |
| కం | గా | రు | | మా | | బ | రం | పు | రం |
| | ర | | | తి | | | గం | | గ |
| చా | డీ | లు | | కుం | ప | టి | | ది | బ్బం |


# ఈ వారం కా'ర్టూన్స్'



కొత్తగా ఏమీ లేదు భయ్యా.. ఇంట్లో ఎలాగూ 100% వాళ్లదే కదా.. ఇప్పుడు బయట 33% అంతే..!!
Zakir...





క్లాసులో 'వాడూ-వీడూ' అంటే టీచర్ కొట్టుద్ది కదా.. మీకలా నేర్ప లేదా..?!
Zakir...

ఒక్క హైదరాబాదులోనే లక్ష సార్లు నీట మునిగాం కదా... కనీసం జలుబు కూడా లేదేమి స్వామి..!!?
Zakir...

## ఫోటో ఫీచర్



ప్రపంచంలోని అందమైన గ్రామాల్లో 'ఇనే' ఒకటి. ఇది జపాన్‌లో ఉంది. ఇక్కడ చాలావరకు బోట్‌హౌస్‌లను ఇళ్లుగా వాడుకుంటారు. ఎత్తయిన కొండకోనలు, పర్వతాలు, ప్రశాంత వాతావరణం మధ్య వున్న ఈ ఊరు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది.

